WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, మార్చి 6, 2025 | సంపుటి - 21 | సంచిక 169 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

- నాడు అప్పులు చేసి ప్రజల కష్టాలు తీర్చితే..
- నేడు అప్పులు చేసి జేబులు నింపుకుంటున్న సీఎం రేవంత్
- మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు

2

హైదరాబాద్,మార్చి5(నినాదం):

నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు.

# లక్షలు కొట్టు.. ఎన్ఓసీ పట్టు

- ఇరిగేషన్ శాఖలో అధికారుల లంచావతారం
- కాసులు ఇస్తేనే లే అవుట్లకు అనుమతి

ఏఈ నుండి ఎస్ఈ దాకా పంపకాలు | ఒక్కో లేఔట్‌కు ఐదు లక్షలపైనే వసూళ్ళు

అమిస్తాపూర్ శివారులోని ఓ లేఔట్ వెంచర్ యజమాని వాగును ఆక్రమించి ప్రహరి నిర్మించిన దృశ్యం



మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు లంచాలకు తేర లేపారు. లంచాలు ఇస్తేనే లేఔట్లకు ఎన్ఓసీ జారీ చేస్తూ కోట్లకు పడగ లెత్తారు. ఒక్కో లేఔట్ కు రూ.5 లక్షల పైన చెల్లిస్తేనే లేఔట్లకు ఎన్ఓసీలు జారీ చేస్తున్నారు. లేఔట్ లకు అనుకుని ఎఫ్ టి ఎల్ భూములు, నాళాలు, వాగులు ఉంటే అధికారులు మరింత ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి5(నినాదం):

అధికారులకు కాసులు ఇస్తే ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములకు సహితం ఎన్ఓసీ ఇస్తూ ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు. నాలాలకు ఇరువైపులా ప్రభుత్వం సూచించిన మేరకు స్థలాలను వదిలిపెట్టి రియాల్టర్లు నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా వాటిని పట్టించుకోకుండా నేరుగా నాలాలపైనే నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమాలకు పాల్పడుతూ అవినీతిమయంగా మారిన అధికారులు నాలాలపై నిర్మాణాలను అడ్డుకోకుండా పరోక్షంగా అక్రమ నిర్మాణాలకు క్లీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ లేఔట్లకు ఎన్ఓసీలు ఇస్తే చెరువుల ఎఫ్టీఎల్ పూర్తిస్థాయిలో నిండితే నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు అక్రమంగా ఎన్ఓసీలు జారీ చేస్తూ జారీ చేస్తూ అటు ప్లాట్ల కొనుగోలుదారులకు, ఇటు ప్రభుత్వానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారి కి ఆనుకుని ఉన్న మండలాల్లో ఎన్ఓసీల జారీకి అధికారులు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

▸▸తరువాయి 2లో



# అలాట్ చేశారు.. ఆర్డర్ కాపీలు మరిచారు..

కాలేజీల్లో జాయినింగ్ అయేదెప్పుడో?

- జేఎల్ అభ్యర్థులకు తప్పని ఎదురుచూపులు
- ఎలక్షన్ కోడ్ పేరుతో కాలయాపన
- సర్కార్ నిర్లక్ష్యంపై 11న మహాధర్నాకు పిలుపు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):

ఏడాదిన్నర క్రితం జూనియర్ లెక్చరర్లకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి తుది ఫలితాలు ప్రకటించినా ప్రభుత్వం ఇటీవలి కాలంలోనే నియామకపు పత్రాలు అందజేసింది. అనంతరం కౌన్సిలింగ్ చేసి కళాశాలలను సైతం అలాట్ చేశారు. కానీ ఇప్పటి వరకు జాయినింగ్ ఆర్డర్ కాపీలు మాత్రం అందించకపోవడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తమౌతున్నాయి. ఇంకెన్నాళ్లు ఎదురుచూపులని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా 1,392మంది జేఎల్ అభ్యర్థులు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో జూనియర్ లెక్చరర్ల నియామకం కోసం టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ విడుదల

▸▸తరువాయి 2లో

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించని చందంగా తయారైంది జూనియర్ లెక్చరర్ల అభ్యర్థుల పరిస్థితి. ప్రభుత్వ కొలువు కోసం జూనియర్ లెక్చరర్ అభ్యర్థులు ఏడాదిన్నరగా ఎదురుచూస్తునే ఉన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా వారి తలరాతలు మారడం లేదు. ప్రభుత్వం మారితే తమ భవిష్యత్ మారుతుందని ఆశపడ్డ అభ్యర్థులకు నిరాశే ఎదురవుతున్నది.

## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

- కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, నినాదం:

వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి.

2

## తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

ఎక్స్ వేదికగా సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు




**చెన్నై, నినాదం:** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు.

## నాడు అడ్డుకొని.. నేడు ఫొటోలకు ఫోజులు

- కాంగ్రెస్‌కు చేతకాని తనంతో రైతులకు నీటి కష్టాలు
- కృష్ణా జలాలను కాపాడుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2



హైదరాబాద్, నినాదం:

కేసీఆర్ కృషి ఫలితం.. సీతారామా ప్రాజెక్టు, నెర్రెలు బాసిన సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. నాడు సీతారామ ప్రాజెక్టును వ్యతిరేకించిన కాంగ్రెస్.. అప్పట్లో అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేశారని అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు మాత్రం గోదావరి జలాల వద్ద ఫొటోలకు ఫోజులిస్తున్నారని విమర్శించారు.

## జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ధి

- పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం

పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి.

4




# పేదలబియ్యం గురు ప్రసాదం

- పెద్దపల్లిలో భారీగా రేషన్ స్మగ్లింగ్
- జిల్లాలో ఒక్కడు,ఎవ్వరికీ చిక్కడు
- నెలకు కోటి లూటీ, పంపకాల్లో మేటి
- పీడీ యాక్టుకు పలువురి డిమాండ్

పెద్దపల్లి, మార్చి 5(నినాదం):

సివిల్ సప్లై స్పెషల్ టాస్క్ ఫోర్స్ వరుస దాడులతో పెద్దపల్లి జిల్లాలోని రేషన్ స్మగ్లర్స్ అందరికీ దాదాపుగా ముక్కుతాడుపడింది.ప్రత్యేకాధికారి లక్ష్మారెడ్డి నేతృత్వంలో అధికారులు రాత్రింబవళ్లూ దాడులు జరుపగా,ఒక్కరు మినహా అందరి దందాలు ఆగిపోయాయి. మిగిలిన ఆ ఒక్కడే జిల్లా మొత్తాన్ని ఏలుతున్నాడనే పేరుంది.ఇది అత్యంత బహిరంగరహస్యమే అయినా ఆపేవారుండరు. ఇలా టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని నిత్యం బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ కోట్లు గడిస్తున్నాడు.సహకరించిన సంబంధిత శాఖల అధికారులకు లక్షలాదిరూపాయల ముడుపులు ముట్టజెపుతాడనే ప్రచారమూ ఉంది.

### ధర్మారం కేంద్రంగా ఆపరేషన్..

జిల్లాలోని ధర్మారం మండలం బొట్లవనపర్తి ప్రధాన అడ్డాగా సాగే సదరు వ్యక్తి దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.మిగతావారందరి దందాలు బందవటంతో అందరి బియ్యం ఈ ఒక్కడే సేకరిస్తున్నాడు.ఆపై జగిత్యాల జిల్లాలోని ఓ రెండు రైస్ మిల్లులకు అమ్ముకుని కోట్ల రూపాయలు జేబులో వేసుకుంటున్నాడు.అంతేకాకుండా ఇతన్ని పట్టపగలే పట్టుకున్న గత డిఎస్ ఓ పై వాహనం ఎక్కించి చంపే ప్రయత్నం చేయటం గమనార్హం.కాగా అందరిఆటకట్టించిన అధికారులకు ఈ ఒక్కడు చిక్కకపోవటం చిదంబర రహస్యంగా మారింది.కాగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు సదరు స్మగ్లర్ పై పీడీ యాక్టు వంటి కఠిన చట్టం ప్రయోగించి దందాకు అడ్డుకట్టవేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

- ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియో కాల్
- డబ్బులు ఇవ్వాలని డిమాండ్..
- పోలీసులకు ఫిర్యాదు



2

## ప్రభుత్వ స్థలాలు వేలం వేయొద్దు..

బీసీలకు కాలేజీ.. హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు నిర్మించండి

రెవెన్యూ శాఖ మంత్రితో చర్చలు



2

## తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

- బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం
- రేవంత్ ఒత్తిడితోనే సస్పెండ్ చేశారు
- బెదిరింపులకు భయపడేది లేదు : తీన్మార్‌మల్లన్న



2

"నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్ బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కుల గణనను తప్పుగా చూపారు. 90 ఏళ్ళ తర్వాత కుల గణన చేస్తే.. చప్పట్లు కొట్టేటోడు కూడా లేడు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేద"ని తీన్మార్ మల్లన్న ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.

## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

- చురుకుగా సహాయక చర్యలు
- కార్పోరేట్ కాలేజీలకు దీటుగా జూనియర్ కాలేజీలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

నల్లగొండ, నినాదం:

నల్లగొండ వరప్రదాయిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం చాలా దురదృష్ట కరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి అయితే నల్గొండ నియోజకవర్గం పూర్తిగా సస్యశ్యామలమవుతుందన్నారు. టన్నెల్ వద్ద సహాయక పనులు చురుకుగా సాగుతున్నాయని, బిఆర్ఎస్ అర్థం లేని విమర్శలను పట్టించుకోబోమని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

2



## బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకోసం మల్లన్న మాటలు

- ఎఐసీసీ అధినేతతో పోల్చుకునే స్థాయి మల్లన్నకు లేదు
- సమయం ఇచ్చినా స్పందించలేదు
- మంత్రి సీతక్క ఆగ్రహం

2



# అలాట్ చేశారు.. ఆర్డర్ కాపీలు మరిచారు..

## "నినాదం" కథనంతోనే కదలికలు

జూనియర్ లెక్చరర్ల సమస్యలపై "నినాదం" పత్రికలో ప్రచురితమైన కథనాలపై ప్రభుత్వంలో కదలికలు వచ్చాయి. పరీక్షలు రాసిన అభ్యర్థులు తుది ఫలితాల కోసం ఏడాదిన్నరగా ఎదురుచూస్తూనే ఉన్నారంటూ గత మూడు మాసాల క్రితం "పరీక్షలు సరే ఫలితాలు ఏవీ" అనే శీర్షికన నినాదం దిన పత్రికలో ప్రధాన పేజీలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ల ఫలితాలు విడుదల చేసింది. అయితే ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం అభ్యర్థులకు నియామకపు పత్రాలు ఇవ్వడంలోనూ జాప్యమే చేసింది.



**మొదటిపేజీ తరువాయి**

చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. 2023లో పరీక్షలు నిర్వహించగా రాష్ట్ర వ్యాప్తంగా 1,392మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. అటు తర్వాత 1:2 పద్ధతిలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసిన ప్రభుత్వం తుది ఫలితాలు ప్రకటించ లేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన బాట పట్టగా గత నెల 19న అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి కళాశాలను అలాట్ చేశారు.

**అలాట్ చేసినా.. ఆర్డర్ కాపీలేవి?**

ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ అభ్యర్థులకు గత నెల 19న కౌన్సిలింగ్ ద్వారా కళాశాలలను అలాట్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,392 మంది అభ్యర్థులకు ఆయా కళాశాలలకు కేటాయించింది. అయితే అలాట్ చేసిన కళాశాలలో జాయిన్ అయ్యేందుకు అవసరమైన ఆర్డర్ కాపీలను మాత్రం ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో మళ్లీ అభ్యర్థులకు ఎదురుచూపులే మిగిలాయి.

**ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో**

గత నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండగా కోడ్ అమలులోకి వచ్చిందనే సాకుతో జేఎల్ అభ్యర్థులకు జాయినింగ్ కాపీలు ఇవ్వడంలో జాప్యం చేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత అందజేస్తామంటూ అభ్యర్థులకు అధికారులు చెప్పడంతో ఆర్డర్ కాపీల కోసం వేచి చూస్తున్నారు. అయితే ఎన్నికలు పూర్తయి కోడ్ ముగిసినా ఇప్పటి వరకు జాయినింగ్ కాపీలు ఇవ్వడంపై ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. ఈ క్రమంలో అభ్యర్థులకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**11న మహాధర్నాకు పిలుపు**

గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం జెఎల్ అభ్యర్థుల విషయంలో అలసత్వం వహించడంపై అభ్యర్థులు ఆందోళనబాట పడుతున్నారు. ఏడాదిన్నర తర్వాత జేఎల్ పరీక్షల తుది ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వం ఇటీవల కళాశాలలకు అటాచ్ చేసి జాయినింగ్ కాపీలు ఇవ్వకపోవడంపై ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 11న ఇందిరాపార్క్ వద్ద జెల్ అభ్యర్థులు తమ కుటుంబాలతో కలిసి మహా ధర్నాకు పిలుపునిచ్చారు. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేయగా దిగివచ్చినట్లే వచ్చిన ప్రభుత్వం ఏదో ఒక మెలిక పెడుతోంది. ఈసారి చేపట్టే మహాదర్నాతో జేఎస్ అభ్యర్థుల నిరీక్షణకు తెరపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



## లక్షలు కొట్టు... ఎన్ఓసీ పట్టు

**మొదటిపేజీ తరువాయి**

ప్రధానంగా బాలనగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్ నగర్, మూసాపేట అడ్డాకుల మండలంలో అడ్డగోలుగా ఎన్వోసీలు జారీ చేస్తూ చెరువులు, కుంటల ఎఫ్ టీ ఎల్ భూములు, నాళాలు, వాగుల అక్రమణకు గురి చేస్తున్నా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి .

**కాసులు ఇవ్వకుంటే ఫైలు కదలదు**

లేఔట్ల అనుమతి కోసం రెవెన్యూ శాఖతోపాటు ఇరిగేషన్ శాఖ తదితర శాఖల నుండి ఎన్ఓసీలు పొందాల్సి ఉంటుంది. కాగా రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించిన అనంతరం లేఔట్ అనుమతికి దరఖాస్తు చేసుకునే రియాల్టర్లు ఇరిగేషన్ శాఖకు కూడా ఎన్వోసి ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకుంటారు. రియటర్లు కాసులు ఇస్తే వెంటనే ఎన్వోసీ జారీకి మొగ్గు చూపుతారు. లేదంటే ఫైలును తొక్కి పట్టి నెలలు తరబడి పక్కన పెట్టేస్తారు. కాగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సిన అధికారులు ఫైలును తొక్కి పట్టి రియాల్టర్ నుండి ముక్కు పిండి లక్షల కొద్ది డబ్బును వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు ఎకరాలు పైబడిన లేఔట్లకు రూ. 5 లక్షలపైనే వసూలు చేస్తూ ఏఈ నుండి ఎస్ఈ వరకు పంపకాలకు పాల్పడుతున్నట్లు ఆ శాఖలోని కొందరు అధికారులు గుసగుసలాడుకోవడం విశేషం. క్షేత్రస్థాయిలో రియల్టర్లు చెరువుల,కుంటల ఎఫ్టీఎల్ భూములను, నాళాలను ఆక్రమించినా కూడా చూసి చూడనట్లు ఇరిగేషన్ అధికారులు వదిలేస్తున్నట్లు తెలుస్తుంది. నాలాలకు ఇరువైపులా బఫర్ జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కొందరు పేరు మోసిన బడా రియాల్టర్లు ఇవి ఏవి పట్టించుకోకుండా వాగులపైనే, నాళాల పైనే నిర్మాణాలను చేపడుతూ కొన్ని చోట్ల ప్రహరీ గోడల నిర్మిస్తూ అధికారులకు సవాలు విసురుతున్నారు. ఇప్పటికైనా పట్టించుకోకుంటే జిల్లాలోని చెరువుల భూములు, వాగులు, నాళాలు, కాలువలు అన్యక్రాంతం అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

**హైదరాబాద్,మార్చి5(నినాదం):**

నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. నాడు అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి వారికి రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఖాతాల్లోకి వేసి.. రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసి.. రూ.6 వేల కోట్లతో రైతుబీమా చేసి.. లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందేలా చేసి.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు.. పారిశ్రామిక, గృహావసరాలకు 24 కరెంటు అందించి.. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామసాగర్ కట్టి 45 వేల చెరువులు కుంటలు బాగుచేసి.. 45 లక్షల మందికి పైగా ఆసరా ఫించన్లతో అండగా నిలిచి.. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, కళ్యాణలక్ష్మి , వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేస్తే అప్పులు తప్పని రాద్ధాంతం చేశారని విమర్శించారు. 15 నెలల పాలనలో రూ.1.65 లక్షల కోట్లు అప్పు చేసి.. రుణమాఫీ ఎగ్గొట్టి.. రైతుబంధు ఎగ్గొట్టి.. రైతుబీమా లేకుండా చేసి.. కరెంటుకు కోతలు వేసి.. గురుకులాలను గాలికి వదిలేసి.. కాళేశ్వరాన్ని ఎండబెట్టి.. పాలమూరు రంగారెడ్డిని పడావు పెట్టి.. శ్రీశైలం సొరంగం కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం ఇది అని కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపడ్డారు. తట్టెడు మట్టి తీసింది లేదు.. ఒక్క పథకం అమలు చేసింది లేదు.. గల్లీలో గాలిమాటలు, ఢల్లీకి ధనం మూటలు మోసుడు తప్పు.. 15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏంటి అని నిలదీశారు. నాడు అప్పులు తప్పని అడ్డగోలు అభాండాలు.. నేడు అందినకాడికి అప్పులు అని విమర్శించారు.



## బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకోసం మల్లన్న మాటలు

హైదరాబాద్ :

ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీతో తీన్మార్ మల్లన్న పోల్చుకునే స్థాయి అతనికి లేదని మంత్రి సీతక్క అన్నారు. మల్లన్న వ్యాఖ్యలపై ఆమె బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొందరు నేతలు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని.. అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పొల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శానసనమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని.. అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు. కాగా.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, జానారెడ్డి, జీవన్ రెడ్డి, వీహెచ్ తదితరులు విడివిడిగా గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని పీఏసీ సభ్యులను మీనాక్షి నటరాజన్ కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు. తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు.

**ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు.**

గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం సమష్టిగా కృషి చేశారని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి స్పందించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని చెప్పారు. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తప్పు చేసిన వాడిని క్షమించే గుణం తనదని అన్నారు. తనను ఎవరూ తిట్టిన తాను పట్టించుకోనని చెప్పారు. తీన్మార్ మల్లన్న సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరం. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం ఆడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు. తమ నాయకులు తనను విమర్శిస్తే ఖండిస్తాలేరన్నారు. అలాగని సమర్థించడం లేదని చెప్పారు. ఎందుకో వారినే అడిగి తెలుసుకోవాలని జానారెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీ వీ. హనుమంతురావు అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడగలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.

## తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

**హైదరాబాద్, నినాదం:**

ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినందుకే పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారని తీన్మార్ మల్లన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. 2011లో రాహుల్ గాంధీ చేసిన పనినే తాను చేసినట్లు తెలిపారు. మన్మోహన్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ చించలేదా?.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్ర వర్ణాలకు మాత్రమే అని వెల్లడిరచారు. ముఖ్యమంత్రి, మంత్రులు.. కులగణనలో నిర్లక్ష్యంగా పాల్గొన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. పదే పదే తప్పులు మాట్లాడుతూ దొరికిపోతున్నారని అన్నారు. ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలవటానికి రేవంత్ సహకరించారని ఆరోపించారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడిరచారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు. "నా రెక్కల కష్టంతోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి నా పాత్ర కూడా ఉంది. కేసీఆర్ నియంత పాలనలో కాంగ్రెస్‌కు.. నా న్యూస్ ఆఫీస్ గాంధీ భవన్‌గా మారింది. నేను ప్రచారం చేసిన 45 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలిచింది. రేవంత్‌కు నచ్చకున్నా.. 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం. హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్ లాంటి వాళ్ళకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ లేదు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా.. కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా లేరు. గౌడ్ కోటాలో జగ్గారెడ్డి సతీమణికి కార్పోరేషన్ పదవి వచ్చింది. రెడ్డిలు పప్పు, బెల్లం లెక్క కార్పొరేషన్ పదవులు పంచుకున్నారు" అంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారు. అలాగే సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మల్లన్న ప్రెస్‌మీట్‌కు బీసీ జేఏసీ నేతలు మద్దతు తెలిపారు.



## నాడు అడ్డుకొని.. నేడు ఫొటోలకు ఫొజులు

తిట్టడం తప్పు.. కట్టడం రాని కాంగ్రెస్‌కు, కేసీఆర్ గొప్పతనం ఇప్పటికైనా అర్థం కావాలని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకు నీరు రాదు అన్నోళ్ళు, ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని కాంగ్రెస్ చేతగానితనం వల్ల సాగర్ ఆయకట్టుకు కరువు వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల రోజుకు పదివేల క్యూసెక్కుల కృష్ణ జలాలను ఆంధ్ర తరలించుకుపోతున్న పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రైతులను ఆదుకునేందుకు ఏకైక మార్గం గోదావరి జలాలను ఒడిసి పట్టి, ఎత్తిపోయడమే అని తెలిపారు. దీన్ని ముందే అంచనా వేసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఛేదించి వడివడిగా 90 శాతం పనులు పూర్తి చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇదే కాంగ్రెస్ నేతలు నాడు సీతారామ ప్రాజెక్టే వృథా అన్నారని.. అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారని చెప్పారు. కానీ కేసీఆర్ పట్టుబట్టి న్యాయపరమైన చిక్కులు తొలగించి, అత్యంత క్లిష్టమైన అటవీ పర్యావరణ అనుమతులు సాధించి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయించారని పేర్కొన్నారు. ఆ ఫలితమే నేడు కరువు కోరల్లో చిక్కుకున్న ఖమ్మం జిల్లా రైతులకు వరంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ అక్కడ ఫోటోలకు మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారంటే అందుకు కేసీఆర్ ఏ కారణమని తెలి పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సాగు, తాగునీటి కష్టాలకు సీతారామ ఒక శాశ్వత పరిష్కార మార్గం అని హరీశ్‌రావు అన్నారు. ప్రత్యక్షంగా ఆరు లక్షల ఎనభై వేల ఎకరాలకు, పరోక్షంగా పది లక్షల ఎకరాలకు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించామని తెలిపారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పది లక్షల ఎకరాలకు నీళ్లించే ప్రాజెక్టును ప్రారంభించారంటే దాని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఓట్లు, సీట్లు, అధికారం శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధే శాశ్వతమని నమ్మే నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. అలా నమ్మి నిర్మించినవే కాళేశ్వరం, సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్టులు అని స్పష్టం చేశారు.



## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

బుధవారం కనగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేంద్ర యూనివర్సిటీ సౌజన్యంతో గ్లూకోమా టెస్టింగ్ మిషన్లను నూతనంగా ఏర్పాటు చేసిన కనగల్ పీహెచ్సీలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటగా కనగల్ మండల కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని మార్చి 6 నుంచి 300 మందికి గ్లూకోమ టెస్టులు చేయనున్నామని చెప్పారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు గ్లూకోమా టెస్టులకు సహకరించాలని కోరారు. మెరుగైన వైద్యం కోసం ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. తొందరలోనే ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ?సీ ఏర్పాటు చేస్తామన్నారు. కనగల్ మండల కేంద్రంలోని తిమ్మన్నగూడెం నుండి సాగర్ హైవేకు రూ.15 కోట్లతో నిధులు మంజూరు అయ్యాయని.. అతి త్వరలో రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే.. గ్రామాలలో లింకు రోడ్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల మంజూరు చేశామని.. వచ్చే అకాడమీకి ఇయర్ నాటికి బిల్డింగ్ పూర్తి చేసి కాలేజీ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే.. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్స్?కు నూతన బిల్డింగులను కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్విరామంగా జిల్లా మొత్తం తిరుగుతూ.. ఆయా మండలాల లోని ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్టల్స్?ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జిల్లాను సురక్షితంగా చూసుకుంటున్నారని.. ఇలాంటి కలెక్టర్ మన జిల్లాలో పని చేయడం అదృష్టమన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ కళ్యాణ్ చక్రవర్తి, మండల పీహెచ్సీ డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మండల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేసి న్యూడ్ కాల్స్‌తో బెదిరింపులకు దిగారు. న్యూడ్ వీడియో కాల్‌ను రికార్డు చేసి ఆయన మొబైల్‌కు పంపించడమే కాకుండా.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు నిన్న రాత్రి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి అమ్మాయి నగ్నంగా కనిపించింది. మొబైల్ స్క్రీన్‌పై ఆ సీన్ చూడగానే వేముల వీరేశం ఫోన్ కట్ చేశాడు. కానీ అదంతా స్క్రీన్ రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ వీడియోను ఆయనకే పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ వీడియోను కుటుంబసభ్యులు, మిత్రులకు పంపించడమే కాకుండా సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానీ ఆయన స్పందించకపోవడంతో ఆ వీడియోను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పంపించారు. ఆ వీడియో చూసిన వెంటనే సదరు నేతలు, కార్యకర్తలు వేముల వీరేశానికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసుల సలహాలతో సైబర్ నేరగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

## ప్రభుత్వ స్థలాలు వేలను వేయొద్దు

**హైదరాబాద్, నినాదం:**

ప్రభుత్వ స్థలాలు గచ్చిబౌలిలో 400 ఎకరాలను అమ్మి 30 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే ఇతర చోట్ల కూడా అమ్మి బడ్జెట్ సేకరించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ స్థలాలను వేలం వెయ్యరాదని, ఇది బీసీ కాలేజీ హాస్టళ్ళు, బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ నేడు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. చర్చలు జరిపారు. ఈ చర్చలలో రాజేందర్ ముదిరాజ్, ర్యాగా రమేష్, పగిళ్ళ సతీష్, రవి కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 295 హాస్టళ్ళు నిర్వహిస్తున్నారు. కానీ ఒక హాస్టల్ కి కూడా స్వంత భవనం లేదు. హాస్టళ్ళు ప్రారంభించి 27 సంవత్సరాలు అవుతున్న ఒక దానికి కూడా స్వంత భవనాలు లేకపోవడం అన్యాయం. అలాగే 320 బి.సి గురుకులాలకు స్వంత భవనాలు లేవు. అన్నీ ప్రభుత్వ ఆఫీసులకు స్వంత భవనాలు యున్నవి. అన్నీ పాఠశాలలకు స్వంత భవనాలు యున్నవి. కానీ కేవలం ప్రభుత్వ బి.సి హాస్టళ్ళకు, గురుకులాలకు ఒక్క స్వంత భవనం లేకపోవడంతో న్యాయం ఏమైనయుందా! చివరకు వందల కోట్ల రూ. పెట్టి ప్లై ఓవర్స్, స్కై ఓవర్స్ అండర్ -వర్స్ నిర్మిస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకొనే, బి.సి విద్యార్ధులకు స్వంత్ భవనాలు నిర్మించాలనే ఆలోచన ఎందుకు రావడం లేదు. దీని మూలంగా మానవ వనరులను తీర్చిదిద్దవలసిన హాస్టళ్ళు సౌకర్యాలు లేక జ్ఞాన వికాసం పొందలేక పోతున్నారు. ఇది ఎదుగుతున్న సమాజనికి నష్టం. ఇది బీసీ విద్యార్ధులకు నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. అంటే కాదు మానవ వనరులను తీర్చి దిద్దా లేకపోతున్నాం.



స్వంత భవనాలు లేకపోవడం వలన అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాలలో చాలీ చాలని వసతులతో విద్యార్థులు కిక్కిరిసి యున్నారు. దీని వలన విద్యార్థులు ఆరోగ్యం దెబ్బతింటుంది. చదువు దెబ్బతింటుంది. పైగా ఏటా అద్దె కింద కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. కావున అన్ని వసతులతో స్వంత భవనాలు నిర్మాణం చేయవలసియుంది.

ఇటీవల బీసీ సంఘం నాయకత్వాన 10 మంది నాయకులు ప్రధానమంత్రిని కలిసి బీసీ హాస్టళ్ల నిర్మాణానికి బడ్జెట్ ఇవ్వాలని కోరాము. ప్రధానమంత్రి సోషల్ జస్టిస్ మంత్రిని కలిసి చర్చలు జరుపుతామని ఫోన్ చేశారు. ప్రధానమంత్రి ఆదేశాల ప్రకారం మేము సోషల్ జస్టిస్ మంత్రితో చర్చలు జరిపాము, అక్కడ మంత్రిగారు ఆదేశాలు ఇచ్చిన వివరాలు దేమిటంటే గ్రు

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కాలేజీ హాస్టళ్ళ నిర్మాణానికి స్థలాలు సేకరించి ప్రతి పాదనలు పంపితే, బాలికల హాస్టళ్ళకు 80శాతం, బాలుర హాస్టళ్ళకు 60 శాతం గ్రాంటు ఇస్తామని ప్రధాని చెప్పాడు. కావున రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు అమ్మకుండా బి.సి హాస్టళ్ళకు – గురుకులకు స్థలాలు ఈ క్రింది విధంగా కేటాయించాలని కోరారు



# బిజెపి పునర్విభజన రాజకీయం !

దక్షిణాదిలో బిజెపి పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండిరది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్వి భజన పక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ పక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

## తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

### ఎక్స్ వేదికగా సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

చెన్నై, నినాదం:

కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బ్జడెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన పక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన పక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

# ఈ భూతాపాన్ని ఆపేదెలా ?




**మధ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు దక్షిణ ద్వీప కల్పంలోని ఉత్తర ప్రాంతాలు, వాయువ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. 1901 తర్వాత అత్యంత వెచ్చని సంవత్సరంగా 2024ని భారత వాతావరణ శాఖ నిర్ధారించింది. ఐఎండి సమాచారం మేరకు గత 124 సంవత్సరాలలో ఈ ఫిబ్రవరి అత్యంత వేడిని నమోదు చేసింది.**

సగటు ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ. మొదటి సారిగా దేశవ్యాప్తంగా సగటు కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైంది. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యంత వెచ్చని నెల. సగటు గరిష్ట ఉష్ణోగ్రత పరంగా ఫిబ్రవరి 2025 రెండవ అత్యంత ఉష్ణోగ్రత నెలగా మారింది. మార్చి నెలలో నెలవారీ గరిష్ట ఉష్ణోగ్రతలు దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉండొచ్చని కొన్ని దక్షిణ ప్రాంతాలలో తప్ప సాధారణం కంటే తక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని, ఈ కాలంలో వాయువ్య భారతదేశం, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ నెలవారీ కనిష్ట ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉండొచ్చని, ఇక్కడ సాధారణ కనిష్ట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

ఇటువంటి పరిస్థితులు చూస్తుంటే రానున్న రోజులలో భూగోళంపై సమస్త జీవరాశులు ఉనికి ఎలా ఉంటుందో, ఏమో అనే సందేహం కలుగుక మానదు. వీటికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. కానీ కారకుడు మాత్రం వంద శాతం మనిషే ! వాడి సుఖం కోసం పర్యావరణాన్ని కాలుష్యం చేసి ప్రకృతి పట్ల తీసుకొన్న అనాలోచిత చర్యలు ఫలితమే ఈ విపత్తులు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎప్పటి నుండో శాస్త్రవేత్తలు మొత్తుకుంటున్నారు. కర్ణుడు చావుకి కోటి కారణాలు అన్నట్లు ఈ భూతాపానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. అందులో ప్రధానమైంది అన్ని రకాల కాలుష్యం అన్నది కాదనలేని వాస్తవం. ధరణికి ఈగతి పట్టడానికి అగ్రదేశాల ఆగడాలే. ఎలా అంటారా అయా దేశాలు వాతావరణానికి చేస్తున్న హానే ఎక్కువ. పారిశ్రామికీకరణ రాకతో భూఉష్ణోగ్రతలు వేగంగా పెరిగాయి. కర్మాగారాల నుండి వెలువడే హానికరమైన ఉద్గారాలు భూతాపాన్ని పెంచుతాయి. మానవ, సహజ కారకాలు రెండూ భూమి వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి.

### గ్లోబల్ వార్మింగ్ కారణమా !

భూమి వేడెక్కడాన్ని భూతాపం లేదా గ్లోబల్ వార్మింగ్ అంటారు. దీనికి కారణం వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్హౌస్ వాయువులే ! వాతావరణంలో వేడిని బంధించే వాయువులను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. పగటిపూట సూర్యుడు భూవాతావరణాన్ని వేడి చేస్తాడు. రాత్రి సమయంలో భూమి చల్లబడినప్పుడు వేడి తిరిగి వాతావరణంలోకి ప్రసరిస్తుంది. ఈ ప్రక్రియలో భూవాతావరణంలోని గ్రీన్హౌస్ వాయువుల ద్వారా వేడిని గ్రహించబడుతుంది. ఇది భూమి ఉపరితలం వేడెక్కేలా చేస్తుంది. సూర్యుని నుండి ఉష్ణశక్తి భూమికి చేరినప్పుడు భూమి ఈ శక్తిలో కొంత భాగాన్ని గ్రహిస్తుంది. మిగిలిన భాగాన్ని వేడిగా అంతరిక్షంలోకి ప్రసరిస్తుంది. భూమి యొక్క ఉపరితల ఉష్ణోగ్రత ఇన్కమింగ్, అవుట్గోయింగ్ శక్తి మధ్య ఈ సమతుల్యతపై ఆధారపడి ఉంటుంది. శక్తి సమతుల్యతలో మార్పు భూమి యొక్క సగటు ఉష్ణోగ్రత వెచ్చగా లేదా చల్లగా మారుతుంది. ఇది దిగువ వాతావరణంలో భూమిపైన, మహా సముద్రాలలో అనేక ఇతర మార్పులకు దారితీస్తుంది.

### గ్రీన్హౌస్ లేదా హరిత వాయువులు :

కార్బన్డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఫ్లోరినేటెడ్లను గ్రీన్హౌస్ వాయువులనంటారు. మానవ కార్యకలాపాల కారణంగా పారిశ్రామిక విప్లవం నుండి కీలకమైన గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతలు పెరిగాయి. కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ సాంద్రతలు గత ఎనిమిది లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు భూమి వాతావరణంలో అధికంగా ఉన్నాయి. పారిశ్రామిక పూర్వ కాలంలో ఉష్ణోగ్రతతో పోలిస్తే " రెండు డిగ్రీల సెల్సియస్ పెరుగుదల సహజ పర్యావరణం, మానవ ఆరోగ్య శ్రేయస్సుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపడంతోపాటు వాతావరణంలో ప్రమాదకరమైన మార్పులు సంభవించే ప్రమాదం ఉంది. " ఈ కారణాన ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్కు పరిమితం చేయాలని అంతర్జాతీయంగా నిర్ణయించడం జరిగింది. మానవ ప్రేరిత భూతాపం ప్రస్తుతం దశాబ్దానికి 0.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగు



తోంది. ఏడాదికి సుమారు 30 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదలవుతుంది. పారిశ్రామిక పూర్వ కాలం నుండి ప్రస్తుతానికి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాయువుల సాంద్రతలు వరుసగా 48శాతం, 250 శాతం, 20 శాతం ఎక్కువగా ఉన్నాయి. ఈ వాయువులు వరుసుగా 18 వ శతాబ్దం నుండి దాదాపు 280 పార్ట్స్ పర్ మిలియన్ (పిపియం) నుండి 414 పిపియంకి, 722 పార్ట్స్ పర్ బిలియన్( పిపిబి ) నుండి 1867 పిపిబి కి, 270 పిపిబి నుండి 332 పిపిబి కి పెరిగాయి.

### కారణాలు:

బొగ్గు, చమురు, శిలాజ ఇంధనాలను కాల్చడం వలన కార్బన్డయాక్సైడ్ , నైట్రస్ఆక్సైడ్లు, ఆవులు గొర్రెలు తమ ఆహారాన్ని జీర్ణం చేసేటప్పుడు మీథేన్, నైట్రోజన్ ఎరువులు నైట్రస్ఆక్సైడ్లును, ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లునుండి క్లోరో ఫ్లోరో కార్బన్లు, ఫోమింగ్ ఏజెంట్లు, మంటలు ఆర్పే యంత్రాలు, ద్రావకాలు, పురుగుమందులు , ప్రోపోలెంటలు నుండి క్లోరోఫ్లోరో కార్బన్‌లు, హైడ్రోక్లోరోఫ్లోరోకార్బన్‌లు, హైడ్రో ఫ్లోరోకార్బన్‌లు, పెర్ఫ్లోరోకార్బన్‌లు, సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్‌లు వంటి ఎఫ్ – గ్యాస్లు కారణమవుతున్నాయి. అటవీ నిర్మూలన, వాహనాల అధిక వినియోగం, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ కార్యకలాపాలు గ్లోబల్ వార్మింగ్కు కారణాలు. సూర్యుని హానికరమైన రేడియేషన్ల నుండి భూ ఉపరితలాన్ని రక్షించడానికి ఓజోన్ పొర బాధ్యత వహిస్తుంది. కానీ ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్‌ల నుండి విడుదలయ్యే క్లోరోఫ్లోరోకార్బన్లు ఓజోన్ పొర క్షీణతకు కారణమై సూర్యుని నుండి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిని చేరి తద్వారా భూమి ఉష్ణోగ్రత పెరుగుతుంది. వాతావరణంలోని ఏరోసోల్స్ వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. ఏరోసోల్‌లు చాలా చిన్నవిగా ఉండే సూక్ష్మ (ఘన లేదా ద్రవ) కణాలు. ఇవి పెద్ద కణాల వలె త్వరగా ఉపరితలంపై పడకుండా రోజుల నుండి వారాల వరకు గాలిలో ఉండిపోతాయి. శిలాజ ఇంధనాలు జీవపదార్థాలను కాల్చడం వంటి మానవ కార్యకలాపాలు ఈ పదార్థాల ఉద్గారాలకు దోహదం చేస్తాయి. గ్రీన్‌హౌస్ వాయువుల వలె కాకుండా ఏరోసోల్‌ల వాతావరణ ప్రభావాలు అవి దేనితో తయారు చేయబడ్డాయి, అవి ఎక్కడ విడుదలవుతాయి అనే దానిపై ఆధారపడి ఉంటాయి. వాటి రంగు ఇతర కారకాలపై ఆధారపడి ఏరోసోల్స్ సూర్యరశ్మిని గ్రహించవచ్చు లేదా ప్రతిబింబిస్తాయి. సూర్యరశ్మిని ప్రతిబింబించే ఏరోసోల్‌లు, అగ్నిపర్వత విస్ఫోటనాల నుండి కణాలు, బొగ్గును కాల్చడం నుండి వెలువడే సల్ఫర్ ఉద్గారాలు వంటివి శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. నలుపు కార్బన్ (మసిలో ఒక భాగం) వంటి సూర్యరశ్మిని గ్రహించేవి వార్మింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటాయి.

క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ అనేది జాతీయ అంతర్జాతీయ వాతావరణ రాజకీయాలలో పారదర్శకతను ప్రారంభించడానికి ఒక సాధనం. ఇటీవల విడుదల చేసిన క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (సిసిపిఐ) 2024లో మనదేశం 7 వ స్థానంలో ఉంది. గత యేడాది 8వ స్థానంలో ఉండేది. డెన్మార్క్, ఎస్టోనియా, ఫిలిప్పీన్స్ దేశాలు వరుసగా 4వ, 5వ, 6వ స్థానాలలో నిలిచాయి. మొదటి మూడు స్థానాలు ఏ దేశానికీ కేటాయించలేదు. సిసిపిఐ యూరోపియన్ యూనియన్తో కలిపి 64 దేశాలకు ర్యాంకింగ్ ఇస్తుంది.

### పరిష్కారాలు :

పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన విధంగా మనం గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్ కి పరిమితం చేయాలి. శిలాజ ఇందనాలతో నడిచే వాహనాల స్థానంలో బ్యాటరీ వాహనాలను వాడాలి. ఇందుకు ప్రజలను ప్రోత్సహించాలి. సోలార్, గాలి మరలునుపయోగించి విద్యుత్తును తయారు చేసుకోవాలి. గ్రీన్హౌస్ వాయువులను విడుదల చేసే పరిశ్రమలను మూసివేయాలి. వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు బదులుగా బయో ఫెర్టిలైజార్స్ వాడాలి. వాయు కాలుష్యాన్ని, జల కాలుష్యం కారకాలను గుర్తించి వాటిని అపే ప్రయత్నాలు కొనసాగించాలి. కార్బన్ పన్నులను పెంచాలి. ఎక్కువ సంఖ్యలో మొక్కలను నాటాలి. ప్లాస్టిక్లలకు ప్రత్యామ్నాయాలు వెతకాలి. అవసరం మేరకే ఇంట్లో విద్యుత్తును వాడాలి. అధికంగా ఎసిలు వాడకూడదు.

వ్యక్తిగత వాహనాలకు బదులుగా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ను వినియోగించాలి. అత్యవసరం అయితేనే విమానాల్లో ప్రయాణించాలి. ప్రజలందరికీ గ్లోబల్ వార్మింగ్ గురించి చైతన్య పరచాలి. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

### కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ : వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండిరతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

## జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ది

### పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం

న్యూఢిల్లీ :

పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండిరతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్దారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడోవంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.



# కొడవటంచ జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదు
- అన్ని శాఖల అధికారులు అందుబాటులోనే ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాలపల్లి, మార్చి 5 (నినాదం న్యూస్):** కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరుగుతున్న జాతర ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాటు పనులతో పాటు భద్రతా ఏర్పాట్లు, మంచినీటి సదుపాయాలు, పార్కింగ్, పారిశుద్ధ్య మరియు ఇతర ఏర్పాటు పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణ, మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు సౌకర్యాలు వంటి తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు పార్కింగ్ స్థలాన్ని గుర్తించి వాహనాలు క్రమబద్ధీకరణకు సైనేజి బోర్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు, నిర్వాహకులు కలిసి సమన్వయంతో పనిచేసి భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అధికారులు, అర్చకులు దేవాలయ సంప్రదాయం ప్రకారం జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికి స్వామి వారి ఆశీర్వచనం అందచేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ బోనాల కిషన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నిర్మల, విద్యుత్ డీఈ పాపిరెడ్డి, ఆలయ ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్**



**ములుగు ప్రతినిధి, (నినాదం):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి. ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి సమస్యలు లేని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. 2020 లో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారమే ఫీజు ఉంటుందని, మార్చి 31 లోపు ఫీజు చెల్లించే వారికి 25శాతం తగ్గింపు వర్తిస్తుందని, ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్, పంచాయితి రాజ్ అధికారులు సమన్వయం చేసుకుని ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు, తహసిల్దార్ విజయ భాస్కర్, ఎంపీలు, ఆర్ ఐ లు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ అర్జీదారులకు తెలంగాణ ప్రభుత్వం సువర్ణ అవకాశం

- అనధికార లే ఔట్ల క్రమబద్దికరణ
- 25 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మరిపెడ మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ రెడ్డి



**డోర్నకల్ /మరిపెడ మార్చ్ 05(నినాదం న్యూస్ ) :** మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ నరేష్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనధికార లే ఔట్ల క్రమబద్దికరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ నెల 31వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ ఇస్తుందని మరిపెడ మండలంలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని,క్షేత్రస్థాయిలో ప్రజలకు సూచించారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలి.ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలన్నారు.2020 సంవత్సరంలో రూ 1000/- కట్టి ఎల్ఆర్ఎస్ లో దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభమైంది.తమ ప్లాటు రెగ్యులరైజ్ చేసుకునే వారికి ప్లాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి వాల్యుయేషన్ ప్రకారం ఎల్ఆర్ఎస్ లో దరఖాస్తు ఫీజు వేస్తారు.దీంతో ఎల్ఆర్ఎస్ లో దరఖాస్తు చేసుకున్న వారికి లాభం జరుగుతుంది.2020 సంవత్సరంలో అప్లికేషన్ చేసుకున్నవారి కోసం పురపాలక కార్యాలయాల్లో ప్రత్యేకంగా 12 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఏమైనా అనుమానాలు ఉంటే ఏర్పాటు చేసిన డెస్క్ లో సంప్రదించి తమ ప్లాటును రెగ్యులైజ్ చేసుకోగలరన్నారు.అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిపెడ మున్సిపాలిటీలో 1248 ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ వచ్చాయని,అందులో ఒకటి మాత్రమే ప్రొసీడింగ్ కాగా 1247 పెండింగ్ లో ఉన్నాయని అప్లై చేసుకున్న అర్జీదారులకు మున్సిపల్ కార్యాలయం నుండి ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది కావున ఈ అవకాశాన్ని మరిపెడ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు..

**సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి**

మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో 5564 ఇండ్లు ఉన్నాయని 1.71 లక్షల రూపాయల ఆదాయం మరిపెడ మున్సిపాలిటీకి రావాల్సింది ఉండగా కేవలం 80 లక్షలు మాత్రమే పన్ను రూపంలో ప్రజలు మరిపెడ మున్సిపాలిటీ కట్టారని,53 శాతం ప్రజలు పన్నులు కట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు..వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ నరేష్ రెడ్డి తెలిపారు...

## కోదాడలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**కోదాడ మార్చి 5 (నినాదం న్యూస్):** కోదాడలో ఇంటర్ పరీక్షలు ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు.ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష మొదలయ్యాక 9.05 నిమిషాలకు వచ్చిన విద్యార్థులను కూడా పరీక్షకు అనుమతించారు. మొత్తం 8 సెంటర్లు.. 2147 మంది గాను 2038 మంది హాజరయ్యారు. 94 మంది హాజరు కాలేదు తొలిరోజు పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు వాచ్‌లు, సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి అనుమతించలేదు

## ప్రశాంతంగా ఇంటర్ ప్రథమ పరీక్షలు

**మంగపేట మార్చి 5 (నినాదం న్యూస్ ) :** మంగపేట మండల కేంద్రంలోని ఎక్కటి సరోజినీ శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్టూడెంట్స్ పరీక్షలు రాశారు. బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ మాత్రం వార్షిక పరీక్షకు 118 మంది స్టూడెంట్స్ హాజరు కావాల్సి ఉండగా 109 మంది హాజరయ్యారని 9 మంది స్టూడెంట్స్ గైర్హాజరయ్యారని మంగపేట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పరీక్షల నిర్వహణాధికారి మండల సంతోష్ తెలిపారు. పరీక్షలు రాయడం కోసం వచ్చే స్టూడెంట్స్ కోసం తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయం కల్పించారు. బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో మంగపేట ఎస్సై టివిఆర్ సూరి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు.

# ఆదివాసి ఎరుకల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం

- అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయండి
- ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు



**జమ్మికుంట, మార్చి 5 (నినాదం న్యూస్) :** ఆదివాసి ఎరుకల పేద విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు దూరం చేస్తుందని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆరోపించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కూతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండలం కేంద్రంలో వరంగల్, ములుగు, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ..తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసి ఎరుకల విద్యార్థి విద్యార్థులు మరియు ఇతర గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న బాధలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం విదేశీ విద్యను అభ్యసించడానికి తల్లిదండ్రులు అప్పులు చేసి విదేశాలకు పంపిస్తే, ఇంతవరకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ సకాలంలో విడుదల చేయకపోవడం వలన తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు డబ్బులు విడుదల చేస్తున్నారు కానీ పేద విద్యార్థుల చదువుకు బకాయిలు విడుదల చేయడానికి మనసు రావడం లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి తక్షణమే నిధులు విడుదల చేయాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఖరిని ఎండకట్టి ప్రజలలో తీసుకెళ్తామని రాజు పేర్కొన్నారు.హైదరాబాద్ అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు విదేశీ విద్యను దూరం చేస్తున్నదని ఆరోపించారు. ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను కూడా విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎంపికై వివిధ దేశాలల్లో చదువుకుంటున్న ఆదివాసి ఎరుకల విద్యార్థులతో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్ లో మాట్లాడడం జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సదుద్దేశంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజన పేద విద్యార్థులకు కూడా విదేశీ విద్య అందాలన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం ఉద్దేశాలకు తూట్లు పొడుస్తున్నదని గుర్తు చేశారు. రెండో విడత నిధులను ఎందుకు విడుదల చేయడం లేదో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన పేద విద్యార్థులను ప్రభుత్వం ఎందుకు చులకనగా చూస్తున్నదని నిలదీశారు. స్కాలర్ షిప్ అందక అనేక ఆదివాసి గిరిజన పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, స్కాలర్ షిప్స్ విడుదల కోసం తల్లిదండ్రులు, విద్యార్థులు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు.

కాంట్రాక్టర్లకు డబ్బులు విడుదల చేస్తున్నారు కానీ గిరిజన బడ్జెట్ నుంచి విద్యార్థుల చదువుకు బకాయిలు విడుదల చేయడానికి మాత్రం డబ్బులు లేవా అని ప్రశ్నించారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్ మాత్రమే కాకుండా ఇతర స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వం ఆదివాసి గిరిజన విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పడుతున్న బాధలను కష్టాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్స్ నిధులు విడుదల చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఖరిని ఎండకట్టి నిధులను విడుదల చేయించుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ జిల్లా ఇన్చార్జి కోనేటి రాజు, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేవెల్లి రాజలింగం, జిల్లా ఉపాధ్యక్షులు బండి సమ్మయ్య, కుతాడి కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాడి తిరుపతి, జిల్లా కోశాధికారి మానుపాటి మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వరంగల్ జిల్లా అధ్యక్షులు కేతిరి రాజశేఖర్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, పాలకుర్తి నారాయణ, హనుమకొండ జిల్లా అధ్యక్షులు లోకిని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, కరీంనగర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కేతిరి సుభాష్, యూత్ అధ్యక్షులు అంగడి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల రాము, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు అంగడి కుమార్, పెద్దపల్లి పట్టణం అధ్యక్షులు మానుపాటి ఎల్లయ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దుగ్యాల బాపు, ప్రధాన కార్యదర్శి లోకి రవి, ములుగు జిల్లా అధ్యక్షులు కేతిరి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# వామ్మో ఇసుక లారీలు..!

- రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలిపివేత
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనదారులు.. రైతులకు తప్పని తిప్పలు
- పట్టించుకునే నాధుడే కరువు

**మహదేవపూర్ మార్చి 5, ( నినాదం న్యూస్):** రోడ్లపై వెళ్లాలంటే వామ్మో ఇసుక లారీలుంటాయనే దుస్థితి ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నెలకొంది. ఇసుక క్వారీల పుణ్యమా అని వందల సంఖ్యలో ఇసుక లారీల రాకపోకలతో ఇటు వాహనదారులు, అటు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇక వాహనాలతో రోడ్డు ఎక్కాలంటే జనం జంకే పరిస్థితులు ఏర్పాడ్డాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో ఇసుక లారీలు రోడ్లపై ఇష్టారాజ్యాంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై అడ్డూ అదుపు లేకుండా ఉంటున్న లారీలను పట్టించుకున్న నాధుడే కరువైయాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక లారీల వల్ల మండల కేంద్రంలోని ఎల్ అండ్ టి రోడ్డుపై రైతులు సైతం పంట చేలోకి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. లారీలు ఇష్టారాజ్యంగా పెడుతుండటంతో ప్రతినిత్యం రైతులు తీవ్ర ఇబ్బందులను



ఎదుర్కొంటున్నారు. మహాదేవపూర్ కాళేశ్వరం రహదారిపై లారీలు ఇష్టారాజ్యంగా నడుపుతూ తీవ్ర ట్రాఫిక్ జామ్ చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అటు టిజిఎండిసి సిబ్బంది, ఇటు పోలీసులు పట్టించుకోకపోవడంతో గంటల కొద్ది ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు రైతులు అవస్థల పాలవుతున్నారు. వందల కొద్ది లారీలు వస్తుండటం పట్ల లారీల నియంత్రణకు ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుక క్వారీలలో లారీల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే లారీలు నిలుపడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.ఇప్పటికైనా టీజీఎంసిడిసి సిబ్బంది, పోలీసులు పట్టించుకోని తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రైతులకు తప్పని రుణమాఫీ తిప్పలు

- రుణమాఫీల ప్రక్రియ ఇప్పట్లో పూర్తి అయ్యేనా ?
- స్పష్టత ఇవ్వని అధికారులు
- క్షేత్రస్థాయిలో గందరగోళం



**కోదాడ, మార్చి 5 (నినాదం న్యూస్):** ఏడాది కావస్తున్నా రుణమాఫీ నిధుల చిక్కులు మాత్రం వీడడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబానికి రూ.2లక్షల రుణామాఫీ చేస్తున్నట్లు, అందుకు అవసరమైన కసరత్తును పూర్తి చేస్తున్నట్లు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిన క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికి రుణమాఫీ నిధులను నాలుగు విడతల్లో జమ చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నా.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మాత్రం నేటికి రూ.50వేల లోపు రుణాలు పొంది, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో చోటు దక్కిన ఏడాది కావస్తున్నా నిధులు జమకు నోచుకోకుండా పోయిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో సుమారుగా 17,040 గ్రామాల్లో రుణమాఫీ నిధులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 8 నెలలు గడిచిపోతున్నా .. రుణమాఫీ నిధుల జమపై స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా పోవడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. సహకార సంఘాల్లో పంటరుణాలు పొందిన రైతుల వివరాలను కేవైసీలను నమోదు చేయడంతో ఆపరేటర్లు చేసిన తప్పిదాలకు అనేకమంది రైతులు రుణమాఫీ పథకంలో ప్రయోజనం పొందకుండా పోయారు. ప్రభుత్వం ఒకవైపు రుణమాఫీ నిధుల ప్రక్రియలో ఏ ఒక్క అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ జరగలేదని ఫిర్యాదులు రావద్దంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన బ్యాంకర్లు చేసిన తప్పిదాలను సరిచేయడానికి స్పష్టమైన విధివిధానాలు జారీ చేయకపోవడంతో తాము ఏమీ చేయలేమని క్షేత్రస్థాయిలోని బ్యాంకు సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నారు. ప్రభుత్వం 4 విడతలుగా రుణమాఫీ నిధులను విడుదల చేసినా తమకు 50వేల లోపు పంట రుణాలు పొందిన ఎందుకు మాఫీ జరగడం లేదంటూ సంబంధిత అధికారులు నిలదీస్తే సరైన సమాధానం చెప్పకుండా చేతులు ఎత్తేస్తున్నారే తప్ప స్పష్టమైన పరిష్కార మార్గం చూపకపోతుండడంతో అన్నదాతలు అధికార యంత్రాంగంపై దుమ్మెత్తి పోస్తున్నారు. కేవైసీ నమోదు చేయడంలో దొర్లిన తప్పిదాల ఫలితంగా కుటుంబాలకు సంబంధం లేని ఇతర మండలాల రైతుల వివరాలు జమ కావడంతో అనేక రైతు కుటుంబాలకు రుణమాఫీ నిధులు అందని ద్రాక్షలా మారాయి.

# కాంగ్రెస్ మోసపూరిత మాటలతో మోసపోయిన రైతులు


- ఎండుతున్న పంట పొలాలు
- రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ/మునగాల, మార్చి 5 (నినాదం న్యూస్) :** రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా.. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వకుండా నట్టేట ముంచిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇవాళ మునగాల మండల పరిధిలోని నేలమర్రి గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను ఆయన రైతులతో పాటు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ద్వారా రైతులకు రెండు పంటలకు నీళ్లు ఇస్తుంటే కంది, పెసర, మిర్చి, పత్తి పండించే మెట్ట రైతులు భూములను అచ్చుకట్టుకొని వరి సాగు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చాక వారబందీ ద్వారా రైతులకు నీళ్లు ఇస్తానని చెప్పడంతో వారి మాటలు నమ్మిన రైతులు వరిసాగు చేస్తే నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలన్నీ ఎండిపోయి అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులు కంటతడి పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనికరించే దుస్థితిలో లేదని మండిపడ్డారు. రైతాంగాన్ని, అన్ని వర్గాల ప్రజలను గాలికొదిలేసి అధికారంలోకి రావడానికి అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతిమయమైన కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదారిన, దొడ్డి దారిన డబ్బులు ఎలా సంపాదించు కోవాలో అని ఆలోచిస్తుందే తప్ప రాష్ట్ర ప్రజలను పట్టించుకునే దుస్థితి లేదని ఆరోపించారు.ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ రెండు నియోజకవర్గాల ప్రజలు మా పిల్లలని చెప్పుకునే ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎండిపోతున్న పంటలకు నీళ్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని.. ఎక్కడికక్కడ అడ్డుకుంటామని అవసరమైతే జాతీయ రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొగరు రమేష్, అజయ్ కుమార్, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలోపు పీఎం శ్రీ , అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ డా. శ్రీజ.



**ఖమ్మం, మార్చి05(నినాదం న్యూస్):** మార్చి నెలాఖరు లోపు పిఎం శ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ప్రతిపాదించిన పాఠశాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పీఎం శ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం క్రింద ఖమ్మం జిల్లాలో ఎంపిక కాబడిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు కోటి నాలుగు లక్షల 65 వేల 783 రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఈ పాఠశాలల్లో ప్రతిపాదించిన మేరకు మార్చి నెలాఖరు లోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాకు వచ్చిన నిధులను సమర్ధవంతంగా వినియోగించాలని అదనపు కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. పీఎం శ్రీ క్రింద వచ్చిన నిధులు వినియోగిస్తూ పిల్లలకు సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో వినియోగించిన నిధులకు సంబంధించి నివేదికలు అందజేయాలని పేర్కొన్నారు. మనకు అందిన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తేనే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల క్రింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన పనులు పూర్తిచేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద చేసిన ప్రతి పనికి ఎంబి రికార్డులను తయారుచేసి బిల్లుల చెల్లింపు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఇఓ సోమశేఖర శర్మ, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవి కుమార్, జి.సి.డి.ఓ. తులసి, ఎం.ఈ.ఓలు, ఈ.ఈలు, పి.ఎం. శ్రీ పాఠశాలల హెచ్.ఎం.లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ



**మహేశ్వరం, మార్చి 5 (నినాదం న్యూస్):** రంజాన్ మాసం సందర్భంగా చంద్రయానుట్ట హుడా కాలనీలోని హిందూ, ముస్లిం నిరుపేదలకు 150 కిలోల రేషన్, నిత్యావసర సరుకులతో పాటు నగదును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అల్ ఖురేషి వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ అదిల్ ఖురేషి, అధ్యక్షులు అబ్దుల్ ఎల ఖురేషిలు మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని అందరూ కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. తమవంతుగా షహీన్ నగర్, వాడి –ఈ –ముస్తఫా కాలనీలో నిత్యావసర సరుకులతో పాటు నగదును అందజేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ఖలుద్, ఆల్ ఖురేషి, వాలంటీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాడి రైతుల చలో ప్రజాభవన్

- పాడి పశువులతో ప్రజ భవన్‌కు బయలుదేరిన ప్రజాప్రతినిధులను అరెస్టు చేసిన కడ్తాల్ పోలీసులు
- పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే అసెంబ్లీతో పాటు మంత్రుల ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిక



**మహేశ్వరం, మార్చి 5 (నినాదం న్యూస్) :** కడ్తాల్ మండలంలో పాడి రైతులు రోడ్డు ఎక్కారు. కడ్తాల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాడి పశువులతో మహా పాదయాత్ర చేసుకుంటూ ప్రజా భవన్ కు బయలుదేరారు. పాదయాత్ర చేసుకుంటూ ప్రజాభవన్ కి బయలుదేరిన నాయకులతో పాటు పలు ప్రజాప్రతినిధులను కడ్తాల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పాడి రైతుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. నెలలు గడుస్తున్న పాడి రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించక రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తుందని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టుల పర్వాన్ని కొనసాగి స్తుందని మండిపడ్డారు. పరితగతన పెండింగ్లో ఉన్న పాల బిల్లును చెల్లించకపోతే అసెంబ్లీతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి నరసింహారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ మాజీ ఎంపీటీసీలు గోపాల్ ప్రియ రమేష్ రంగయ్య రైతు కోఆర్డినేటర్ వీరయ్య రైతు సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచులు హరిచంద్ నాయక్ తులసి రామ్ కృష్ణయ్య పాడి రైతులు రాములు యాదవ్ రాజు పకీర నాయకులు నరసింహ రామచంద్రయ్య రమేష్ పాండు సిహెచ్ మహేష్ మల్లేష్ పవన్ హెచ్ ఆర్ మహేష్ అంజి శ్రీశైలం బాబా హం జద్ రమేష్ సరియా రవి శ్రీను కుమార్ శ్రీకాంత్ చందర్ మల్లేష్ రవి రమేష్ నాగార్జున సాయికుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.02 కోట్ల గంజాయి పట్టివేత

- సెప్టిక్ ట్యాంకర్‌లో అక్రమంగా తరలిస్తున్న 205 కేజీల గంజాయిని పట్టుకున్న డిటిఎఫ్ టీమ్
- ఏఓబీ నుంచి మహారాష్ట్రకు గంజాయి రవాణా
- వివరాలు వెల్లడించిన మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జె.హరికిషన్







**జిన్నారం /పటాన్ చెరు మార్చి 5 (నినాదం న్యూస్):** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనంలో గంజాయిని తరలిస్తుండగా సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా పారిపోతున్న ఫైనాన్సర్ ను కామారెడ్డి జిల్లా పిట్లం సమీపంలో ఎస్ఓటీ అధికారులు పట్టుకున్నారు. మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జె.హరికిషన్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ 2 వద్ద జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానంతో సెప్టిక్ ట్యాంకర్ క్లీనర్ లో చెకింగ్ చేయగా 205 కిలోల గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న భీం సింగ్, దీపక్ నాగ్ నాథ్ అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించామని చెప్పారు. గంజాయి విలువ సుమారు కోటి రెండు లక్షలు ఉంటుందన్నారు. చాకచక్యంతో పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ టీంను అభినందించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణెమ్మ, పటాన్ చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్, సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ దుబ్బాక శంకర్, ఎస్ఐ హన్మంత్, సిబ్బంది అరుణ్ జ్యోతి, రాజేష్, అంజిరెడ్డి, శివ, తదితరులు ఉన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ పాత్రికేయుల పక్షాన నిలుస్తుంది






- సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య
- సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలి
- కుత్బుల్లాపూర్‌లో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

**కుత్బుల్లాపూర్, మార్చి 05 (నినాదం న్యూస్):** రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్ గా ఏర్పడిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జర్నలిస్టుల ఆదరణతో నేడు నెంబర్ వన్ యూనియన్ గా బలపడిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం సర్కిల్ నల్లగుట్ట నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం, మరోవైపు దాడులు, అవమానాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తి నైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్ధవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రజల, పాత్రికేయుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు ప్రజల పక్షాన ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సివుందని, హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ జరుపబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గడ్డమీది అశోక్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కె సలీమా, తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గుమ్మడి హరి ప్రసాద్, రోజారాణి, నియోజకవర్గం కార్యదర్శి శంకర్, గోవిందరావు, దప్పు రామస్వామి, శివపార్వతి, దామెర జగదీష్ గుప్తా, దుర్గారావు, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శివకుమార్, సత్యనారాయణ, మంజుల రెడ్డి, వెంకట్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా వెట్టి చాకిరీపై కఠినచర్యలు

- రాజ్యాంగ విలువలు పాటించాలి
- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్





**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,మార్చి05,(నినాదం న్యూస్):** కంటోన్మెంట్ బోర్డ్ కార్యాలయంలో దివ్య దిశ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ అక్రమరవాణా వెట్టిచాకిరి నివారణ అవగాహన కార్యక్రమంలో కంటోన్మెంట్ సిఇఓ తో పాటు ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా, గౌరవంగా బతికే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా చట్టరిత్యానేరం అని ఇలాంటి నేరాలను ఎట్టి పరిస్థితులలోనూ క్షమించకూడదని కఠినమైన శిక్షలు ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఇలాంటి నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, సమాజంలో ఇలాంటి విషయాలు ఎవరి దృష్టికి వచ్చినా వదిలేయకుండా వెంటనే దాని పైన స్పందించాలన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఇలాంటి నేరాలను తగ్గించవచ్చని ఎమెల్యే అభిప్రాయపడ్డారు. ఈ అవగాహన కార్యక్రమాలలో పోలీస్, లేబర్ డిపార్ట్ మెంట్ వారిని కూడా భాగస్వామ్యం చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. భాధితులు ఇలాంటి నేరస్తుల బారిన పడటానికి ప్రధాన కారణం పేదరికం, సామాజిక వెనకబాటు అని, చిన్న పిల్లలను బిక్షాటన వైపు మళ్లించడంలో కూడా ఈ మనుషుల అక్రమరవాణా కూడా ఓ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఇలాంటి అరికట్టాలంటే ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు భవిష్యత్ లో ఏర్పాటుచేసినా వ్యక్తిగతం తన సహకారంతో పాటు ఎమ్మెల్యే గా ప్రభుత్వం తరపున కూడా పూర్తి సహాయం అందచేస్తామని అన్నారు. కంటోన్మెంట్ బోర్డ్ ఆఫీసులో ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల కూడా ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ఉద్యోగులు తమ రోజు వారి విధి నిర్వహణలో భాగంగా కంటోన్మెంట్ ప్రజలతో కలిసి ఉంటారు. కాబట్టి వారికి అవగాహన కల్పించడం వల్ల సమాజంలో ఎంతో మార్పు వస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.!ఇలాంటి మంచి అవగాహన కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు, బోర్డు కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చిన సిఇఓ కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కంటోన్మెంట్ సిబ్బందిని ఆయన అభినందించారు.

# పెరుగుతున్న సైబర్ నేరాలు..



- ప్రజల్లో అవగాహన, అప్రమత్తత అవసరం
- అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించిన రాచకొండ పోలీస్ కమిషనరేట్




**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,మార్చి05,(నినాదం న్యూస్):** రోజు రోజు కు సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాచకొండ కమిషనరేట్ సామాజిక మాధ్యమ ఎకౌంట్ల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పలు వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం సైబర్ అవేర్నెస్ డే సందర్భంగా అంతర్జాల మోసాలు ఇతర సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం కోసం పలు అంశాల మీద రాచకొండ కమిషనరేట్ రూపొందించిన ప్రత్యేక వీడియోలను కమిషనర్ సుధీర్ బాబు విడుదల చేయడం జరిగింది. ఈ వీడియోలను నెలరోజుల పాటు అంశాల వారీగా, మూడు నాలుగు రోజులకు ఒకసారి అన్ని సామాజిక మాధ్యమాలలో సమాచార ప్రసార మాధ్యమాల్లో విరివిగా ప్రచారం చేసి ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో, కాలనీల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లిపార్ట్ టైం జాబ్స్ అంటూ మోసాలు..లి సామాన్యులకు డబ్బు ఆశ చూపి వారి వ్యక్తిగత వివరాలతో సిమ్ కార్డులు బ్యాంక్ అకౌంట్లను తీసుకుని వాటిని సైబర్ నేరాల ద్వారా దోచిన సొమ్మును దాచడానికి ఉపయోగించడం కోసం వాడే మ్యూల్ అకౌంట్స్, షేర్ మార్కెట్ పెట్టుబడుల కోసం ఉపయోగించే ట్రేడింగ్ సంస్థల యాప్ లను పోలి ఉండే నకిలీ యాప్ లు తయారు చేసి మోసం చేయడం, నగ్న వీడియో కాల్స్ ద్వారా వ్యక్తులను హనీ ట్రాప్ కు గురిచేసి డబ్బు డిమాండ్ చేయడం, క్రిప్టో కరెన్సీ, ఆన్లైన్ బెట్టింగ్ ల ద్వారా అధిక లాభాల ఆశ చూపించి పెట్టుబడులు పెట్టేలా చేయడం, యువతీ యువకులు అత్యధికంగా ఉపయోగిస్తున్న ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఫ్రెండ్ రిక్వెస్ట్ ల ద్వారా పరిచయం పెంచుకొని వారి వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ ద్వారా అశ్లీల చిత్రాలు తయారుచేసి, వాటిని సదరు వ్యక్తులకు పంపించి వారిని మానసికంగా కృంగిపోయేలా చేసి డబ్బులు డిమాండ్ చేయడం.. లిడిజిటల్ అరెస్టు పేరుతో..లి నకిలీ పోలీసు యూనిఫారం ధరించి వీడియో కాల్స్ ద్వారా అమాయక బాధితుల వ్యక్తిగత వివరాలు కొన్నిటిని చెబుతూ వారు నేరాలకు పాల్పడినట్టు భయపెట్టి వారిని భయభ్రాంతులకు గురిచేసి డబ్బు డిమాండ్ చేయడం, తక్షణమే ఆన్లైన్ ద్వారా లోన్లు అందిస్తామని వ్యక్తులకు కాల్స్ మేసేజిలు చేసి, ఎటువంటి పూచికత్తు, పత్రాలు అవసరం లేకుండా వ్యక్తులకు లోన్ అందించి తర్వాత అధిక వడ్డీల పేరుతో అదనపు చార్జీల పేరుతో వారిని వేధించి సమాజంలో వారి కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించేలా వారిని బెదిరించి వేధించే లోన్ యాప్ లు, ఆన్లైన్ ద్వారా పాత వస్తువులను అమ్మకానికి పెట్టే సమయంలో అధిక ధరకు కొంటామని అమ్మకందారులకు ఆశ చూపి వారికి ఆన్లైన్ నగదు బదిలీ చేస్తామని చెప్పి మోసపూరిత నకిలీ పేమెంట్ లింకులను ఓటీపీలను పంపించి వాటి ద్వారా సదరు వ్యక్తుల బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మొత్తాన్ని దొంగిలించడం వంటి పలు నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన పెంచడం కోసం ప్రత్యేక ప్రచార వీడియోలను రాచకొండ కమిషనరేట్ ఐటీ సెల్ విభాగం రూపొందించడం జరిగింది. అంతేకాకుండా ఎటువంటి అంతర్జాల మోసాలకు సైబర్ నేరాలకు గురైనా భయపడకుండా తక్షణమే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయడం ద్వారా లభించే రక్షణను, నష్ట తీవ్రతను తగ్గించడం ఫిర్యాదు చేసే విధానాలకు సంబంధించిన వీడియోలను కూడా రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశేష కృషి చేస్తూ, సైబర్ నేరాలు అరికట్టడం కోసం ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తున్న ఐటీ సెల్, సైబర్ క్రైమ్ సిసిఆర్బి అధికారులను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. లిబౌషత్ నేరాలు అంతర్జాలం ఆధారంగా..లి ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ, నేటి ఆధునిక సాంకేతిక యుగంలో వివిధ రకాల అవసరాలకు ఎన్నో రకాల సాంకేతిక పరికరాలు ఉపయోగించడం జరుగుతోందని, సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకి కొత్త పుంతలు తొక్కుతోందని, అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తు నేరాలన్నీ ఎక్కువగా అంతర్జాలం ఆధారంగానే జరుగుతాయని, సమాజ అభివృద్ధి కోసం, పనులు సులువుగా కావడం కోసం ఉపయోగించవలసిన అత్యాధునిక సాంకేతికతను కొందరు నేరస్తులు తమ స్వలాభం కోసం అమాయక బాధితులను రకరకాల మార్గాల్లో మోసం చేసి దోచుకోవడం కోసం, అమాయక స్త్రీలను వేధించడం కోసం తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల సైబర్ నేరగాళ్ళ బారిన పడుతున్న బాధితులకు అండగా నిలవాలని, అన్ని రకాల సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మరిన్ని ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో సైబర్ నేరాల పట్ల మరింతగా అవగాహన పెంచేందుకు రూపొందించిన వీడియోలను మరియు సైబర్ నేరాల మీద ఫిర్యాదు చేసేందుకు సంప్రదించవలసిన సైబర్ క్రైమ్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, అదనపు డీసీపీ అడ్మిన్ శివ కుమార్, ఎసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, సీసీఆర్బి ఎసిపి రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ వేడుకలు...



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి05,(నినాదం న్యూస్):** అంతర్జాతియ మహిళా దినోత్సవాల సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అధికారులు చలి వేంద్రం ప్రారంభించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడలు, నృత్యము, సాంగ్స్ వంటి కార్యక్రమాలు టీజీఓ ల ఆధ్వర్యం లో నిర్వహించారు. బుధ వారం జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ దైనందిన జీవితం లో మహిళల పాత్ర, మహిళా శక్తి , మహిళల ధైర్య సాహసాలు, ఓర్పు సహనం గురించి క్లుప్తంగా వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయ కుమారి, టీజీఓ అధ్యక్షులు వినోద్ కుమార్ ,టీజీఓ కార్యదర్శి డాక్టర్ కురు మూర్తి , రాధిక ఎంప్లాయిమెంట్ అధికారి, జాన్సి మేడం బీసీ అభివృద్ధి, గోపాల్ రావు యూత్ స్పోర్ట్స్ డిపార్ట్ మెంటు , శివ ప్రసాద్ ఎల్డిఎమ్ , రవీందర్ టీజీఓ, ఉపాధ్యక్షులు, జిల్ టీజీఓ మహిళా ప్రతినిధులు పాల్గొనడం జరిగినది.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా ఉపవైద్యాధికారి



**మల్లాపూర్, మార్చి 05 (నినాదం న్యూస్):** మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం లోని ల్యాబ్, ఫార్మసీ రికార్డ్ లను తనిఖీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా ప్రజలకు వడదెబ్బ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ఎప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. అధికారి వెంట డాక్టర్ వాహిని, సిబ్బంది పాల్గొన్నారు

# కష్టపడి పని చేద్దాం గులాబీ జెండా ఎగరేద్దాం

- తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారు
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, మార్చి 5 (నినాదం న్యూస్) :** రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందరం కష్టపడి పనిచేసి హుజరాబాద్ నియోజకవర్గంలో టీఆర్ ఎస్ జండా మరోసారి ఎగరవేయాలని హుజు రాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం హుజరాబాద్ కేసి క్యాంపు లోని ఎమ్మెల్యే కార్యా లయంలో ఏర్పాటు చేసిన ఇల్లంతకుంట మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లా డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ లు నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమ య్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడవకముందే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్ప డిందని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీ యాలని, హామీలన్నీ నెరవేర్చే వరకు కాంగ్రెస్ నాయకులను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, తెలంగాణకు కెసిఆర్ అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. మరో సారి కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని అన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పూర్తిస్థాయిలో ఉందని ఆయన అన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల గొంతుకలం కావాలని అన్నారు. అతి త్వరలోనే సర్పంచ్ ఎన్నికలతో పాటు మున్సిపాలిటీ, ఎంపిటిసి, జడ్పిటిసి, ఎన్నికలు జరగనున్నాయని కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉం టుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధులపై కేసులు పెడుతున్నారని, ప్రజా ప్రతినిధు లను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు నియోజకవర్గ మొత్తం ప్రభు త్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నియోజ కవర్గంలో బీఆర్ఎస్ నాయకులకు కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుం టానని అన్నారు. మార్చి 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వివిధ కమిటీలు వేయాలని అన్నారు. ఎమ్మెల్యేగా తనకు అండగా నిలబడి గెలిపించిన వారందరినీ గెలిపించుకునే బాధ్యత తనదేనని అన్నారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన నియోజక వర్గ ప్రజలందరికీ కృతజ్ఞత తెలిపేందుకు ఏప్రిల్ నెలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తానని అన్నారు. వేరువేరుగా జరిగిన ఈ క సమావేశా ల్లో మాజీ ఎంపీపీ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామస్వామి, సీనియర్ నాయకులు చుక్కా రంజిత్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి, ఇల్లంత కుంట మండలంలోని ఇల్లంత కుంట, శ్రీరాముల పల్లి, కనగర్తి, లక్ష్మాజిపల్లి, మల్యాల, వాగొడ్డురామ నపల్లి, సిరిసేడు, పాతర్ల పల్లి, భోగంపాడు, మర్రివానిపల్లి , గడ్డివానిపల్లి, టేకుర్తి , చిన్న కోమ టిపల్లి, రాచపల్లి, మల్లన్న పల్లి, వంతడుపుల బూజునూర్, సీతంపేట గ్రామాలకు సంబంధించిన మాజీ గ్రామ సర్పంచులు నాయకులతోపాటు కార్యకర్తల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు



**జమ్మికుంట, మార్చి5 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జమ్మికుంట పట్టణంలో ప్రశాం తంగా జరిగాయి. పట్టణంలో మూడు సెంటర్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా విద్యార్థులు సమయానికి హాజరై ప్రశాంతమైన వాతావర ణం లో మొదటి రోజు పరీక్షలు రాశారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు కాకతీయ జూని యర్ కళాశాల స్రవంతి జూనియర్ కళా శాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు కావలసిన అన్ని ఏర్పా ట్లను అధికారులు చేశారు. మొదటి సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యా ర్థులు ఉదయం 8 గంటలలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ముందస్తుగా పోలీ స్ సిబ్బంది సెంటర్ల వద్ద పహారా కాయడంతో పాటు జిరాక్స్ సెంటర్ లను మూసి వేయడం జరిగింది. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో 257 మందిని కేటాయించగా 18 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. 239 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై పరీక్షలను రాశారు. అదేవి ధంగా స్రవంతి జూని యర్ కళాశాలలో 201 మంది విద్యార్థులను కేటాయిం చగా ఆరుగురు విద్యా ర్థులు హాజరు కాకపోవడంతో నూట తొంబై ఐదు మంది విద్యార్థులు పరీ క్షలు రాశారు. అదేవిధంగా కాకతీయ జూనియర్ కళాశాలలో 310విద్యా ర్థుల ను కేటాయించగా 264 మంది విద్యార్థులు హాజరు కాగా 46 మంది విద్యా ర్థులు హాజరు కాలేదు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాశారు.

## బేటి బచావో, బేటి పడావోపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**కరీంనగర్, మర్చి 5(నినాదం న్యూస్) :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పథకం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, కరీంనగర్ రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో మండలం విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్యాల స్వప్న పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. సరైన ఆహారం తీసుకుంటేనే బాలికలు ఆరోగ్యంగా పెరిగి తమ లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలని, పాలు, గుడ్లు, కా%ఎ%యగూరలు, పండ్లు వంటి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత మాట్లాడుతూ, బాలికలు అట్రాక్షన్స్‌కి గురి కాకుండా, లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని తెలియజేశారు. సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి సమస్య వచ్చినా చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెడ్మాస్టర్ చంద్రకళ, ఉపాధ్యాయులు, ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్స్ మౌనిక, స్వాతి అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

# హలో పద్మశాలి ఛలో హైదరాబాద్

- కమలాపూర్‌లో పద్మశాలి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ
- సీఎలో ఆల్ ఇండియా 35 వ ర్యాంకు సాధించిన సిరికి ఘన సన్మానం



**జమ్మికుంట, మార్చి5 (నినాదం న్యూస్) :** ఈ నెల తొమ్మిదిన హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న అఖిల భారత పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం చేనేత కార్మికులకు, పద్మశాలి కులస్తులకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు కార్మికులకు మహాసభల కరపత్రాలు పంపిణీ చేసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కార్మికులు సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పద్మశాలి కులస్తుల సమస్యల సాధనకు, చేనేత రంగ అభివృద్ధి, భవిష్యత్తు రాజకీయాలపై నిర్వహిస్తున్న సభకు గ్రామాల్లో నుండి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పద్మశాలీల సత్తా చాటాలని, సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అనంతరం కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిఏ పరీక్షల్లో ఆల్ ఇండియా 35వ ర్యాంకు సాధించిన పద్మశాలి ముద్దుబిడ్డ చేరాల సిరి సహస్రను పద్మశాలి కుల పెద్దలు ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పోరండ్ల కృష్ణ ప్రసాద్, మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, మెండు రమేష్, దాసి శంకరయ్య, ఆడెపు శ్రీకాంత్, నాసని రాజు, ఆడెపు విజయ, బైరి సహదేవ్, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## అపర భద్రాద్రి ఆలయంలో హుండీ లెక్కింపు



**జమ్మికుంట, మార్చి 5 (నినాదం న్యూస్) :** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించినట్లు ఈవో కందుల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఆలయానికి ఆదాయం. 5,45847 వచ్చినట్లు తెలిపారు. అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లంద కుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో 2024 జూన్ నుండి 2025 మార్చ్ 05 తేదీ వరకు 13 హుండీలలో భక్తులు వేసిన డబ్బులను లెక్కించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డివిజ నల్ అధికారి సత్యనారాయణ ఆధ్వ ర్యంలో హుండీ లెక్కింపును రాజరాజే శ్వర సేవా సమితి సభ్యులు హుండీలను లెక్కించారు. 13 హుండీల ద్వారా సుమారుగా 5,45847 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందిమల్లారెడ్డి, రమేష్,ప్రవీణ్,రాజు,తోశ్రీ రాజ రాజేశ్వరి సేవా సమితి వారు పాల్గొన్నారు.

# రజక మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలి

- తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్



**కరీంనగర్, మార్చి5 (నినాదం న్యూస్) :** తెలంగాణ రజక సంఘం మహిళా విభాగం అద్వేర్యంలో తీగల గుట్టపల్లిలో ప్రభుత్వం నుండి వచ్చిన ప్రభుత్వ సర్టిఫికెట్లను తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్ రజక మహిళలకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మండల మహిళా సమాఖ్య సంఘాలను ఆదుకున్నట్లుగానే రజక మహిళా సంఘాలకు నిధులు కేటాయించి ఆదుకోవాలని అన్నారు వచ్చే బడ్జెట్లో రజక కార్పొరేషన్ కు 1000 కోట్లు కేటాయించి వెంటనే ప్రభుత్వం పాలకమండలి నియమించి రాష్ట్రంలోని రజక సహకార సంఘాలుగా ఏర్పడిన రజక వృత్తిదారులను బీసీ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి సబ్సిడీ లోన్స్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని నగరంలో ఇంటి పని వారిగా పని చేస్తున్న మహిళలు కనీస వేతనాలు తీసుకొని సమిష్టిగా చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందు ఉండాలి అన్నారు ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చాకలి ఐలమ్మ గర్జన సభను నిర్వహిస్తున్నమన్నారు విద్యని అభ్యసించిన రజక మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా సంక్షేమ పథకంపై అవగాహన పెంచుకోవాలన్నారు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచులుగా ఎంపిటిసి రి కుల గగనలో భాగంగా రజక జనాభాను అతి తక్కువ చూపరని అన్నారు. ఈ కార్యక్రమం లో రజక మహిళలు పాల్గొన్నారు.

## పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు దగ్ధం

- వాహనాలను తగలబెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి
- జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



**జమ్మికుంట, మార్చి 5 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం లోని మడిపల్లి గ్రామంలో ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను తగులబెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన ముక్కెర పవన్ కళ్యాణ్ ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను మంగళవారం సాయంత్రం సుమారు 9 గంటల 30 నిమిషాల ప్రాంతంలో నేరెళ్ల వెంకన్న ఇంటి పరిసర ప్రాంతంలో పార్కింగ్ చేసిన వాహనాలను పెట్రోల్ పోసి నిప్పు అంటించి పారిపోయినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ వరగంటి రవి తెలిపారు. ఈ ఘటనలో ఐదు ద్విచక్ర వాహనాలు కాలిపోయాయని సిఐ తెలిపారు.

# జాతీయ అవార్డు గ్రహీత ప్రభుకు మందకృష్ణ మాదిగ సన్మానం



**జమ్మికుంట, మార్చి 5(నినాదం న్యూస్) :** వరుసగా క్రీడా పోటీలలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి లో అత్యంత ప్రతిభను కనబరిచి పథకాలు సాధిస్తూ ఇటీవల హైదరాబాదులో జరిగిన తెలంగాణ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ నిర్వహించిన క్రీడా పోటీలలో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ ప్రభు జావలిన్ త్రో ఈవెంట్లో అత్యంత ప్రతిభను కనబరిచి హిమాచల్ ప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయి మాస్టర్ గేమ్స్ పోటీలకు ఎంపిక అయ్యారు. గత సంవత్సరం జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో 45ం విభాగంలో హేమర్ త్రో లో ద్వితీయ స్థానంతో వెండి పత్రం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో తెలంగాణ మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ అవార్డును సుప్రీంకోర్టు న్యాయవాది గీతా చౌదరి, తెలంగాణ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై రామారావు ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ప్రైడ్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ అవార్డు అందుకున్న ప్రభును షాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (ఎమ్మెస్ పి) రాష్ట్ర నాయకులు ఇంజం వెంకటస్వామి, వాగ్గేయకారులు మచ్చ దేవేందర్, మందకృష్ణ మాదిగ ప్రధాన అనుచరులు దూడపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పురుగు మందుల విక్రయ ముఠా అరెస్టు

- రూ 34 లక్షల మందులు స్వాదీనం




**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్ ):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్నదాతలను మోసం చేస్తూ పెద్ద మొత్తంలో నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేసారు. వీరి నుండి సుమారు సుమారు 34 లక్షల రూపాయల విలువగల వివిధ కంపెనీల పేర్ల కలిగి వున్న నకిలీ పురుగు మందులతో పాటు, రెండు కార్లు, ఐదు సెల్ఫోన్లు, నకిలీ పురుగు మందు లేబుల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పిల్ల నాగవెంకట రంగారావు (కుషాయిగూడ, హైదరాబాద్), ముద్దంగుల ఆదిత్య( లక్ష్మీకాపూల్, హైదరాబాద్), కాట్రగౌడ భాస్కర్ రెడ్డి(కురుగోడు, బళ్లారి జిల్లా, కర్ణాటక రాష్ట్రం), పిట్ల నవీన్ ( హైదారాబాద్), దూదిమెట్ల శ్రీధర్ ( ఇందిరమ్మ కాలనీ, మిర్యాలగూడ) ఉన్నారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ రెండు రోజుల క్రితం టాస్క్ ఫోర్స్ మరియు మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహన తనీఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు అనుమానస్పదంగా ఒక కారు తనీఖీ చేయగా అకారులో పురుగు మందల డబ్బాలను గుర్తించి పోలీసులు కారులో వున్న నిందితుల్లో ఒకడైనకాట్రగౌడ భాస్కర్ రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్నట్లుగా పోలీసుల ఎదుట అంగీకరించడంతో మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తంగా నిన్నటి రోజున నిందితుడు కాట్రగౌడ భాస్కర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు టాస్కోఫర్స్ మరియు మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్లోని చర్లపల్లి ప్రాంతంలోని నిందితుల గోడౌన్ దాడి చేసి మిగితా నలుగురు నిందితులతో పాటు బెయర్, టాటా, కోర్టెవాతో మరో నాలుగు కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందులు, గడ్డి మందులను స్వాధీనం చేసుకోని నిందితులను విచారించగా పురుగు మందులకు అవసరమైన ముడి సరుకులను కోనుగోలు చేసిన వాటి ద్వారా డిమాండ్ వున్న కంపెనీ పేర్లతో నకిలీ పురుగు ఇగడ్డి మందులను తయారీ చేసి రైతులను మోసం చేసున్నట్లుగా నిందితులను అంగీకరించడంతో పోలీసులు అరెస్టు చేసి నకిలీ పురుగు,గడ్డి మందులు, లెబుల్స్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితులను పట్టుకొవడం ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, టాస్కోఫర్స్, వరంగల్ ఏసిపిలు మధుసూధన్, నందిరాంనాయక్, టాస్కోఫర్స్, మట్టెవాడ ఇన్స్పెక్టర్లు సార్ల రాజు, గోపి, ఎస్.ఐలు భానుప్రకాశ్, లచ్చయ్య, సాంబయ్య, ఏఏఓ సల్మాన్ పాషా, కానిస్టేబుళ్ళు సురేష్, సాంబరాజు, సురేందర్, రమేష్ లను ను పోలీస్ కమిషనర్ అభినందించారు.




## ఏసీబీ వలలో ఎస్సై శంకరయ్య



**కోరుట్ల నినాదం న్యూస్ (మార్చ్5) :** కోరుట్ల పట్టణం లోని 3 వ ఎస్ ఐ రూపవతి శంకరయ్య 5000/- వెలు లంచం తీసు కుంటూ బుధవారం ఏసీబీ కి చిక్కారు. వివరాల లోకి వెళితే జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగిని పల్లి శివారులో గత నెలలో మామిడి తోటలో పేకాట ఆడుతూ ఎనిమిది మంది పట్టు పడగా వారి వద్ద నుండి 23,000 నగదుస్వాధీన పరుచు కుని కేసు నమోదు కోరుట్ల పోలీసులు చేసారు.

ఎనిమిది మందిలో ఏడు మంది సెల్ ఫోన్లు తిరిగి ఇచ్చివేసి బండారు శ్రీనివాస్ సెల్ ఫోన్ మాత్రం ఇవ్వలేదు అందుకుగాను 5000 డిమాండ్ చేయగా ఏసీబి అధికారులను ఆశ్రయించిన బండారు శ్రీనివాస్ బుధవారం కోరుట్ల పోలీసు స్టేషన్ లో ఎస్ ఐ శంకరయ్య 3కి 5000 ఇస్తుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు ఏసీబీ డిఎస్పి రమణమూర్తి ఆధ్వర్యంలో పట్టుకున్నారు.




# నగరంలో పలు పార్కులు, పార్కు స్థలాలను సందర్శించిన కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్

- అల్కాపురి పార్కుతో పాటు పలు పార్కు స్థలాలు తనిఖీ
- వ్యర్థాలతో వేస్టు టూ వండర్ పార్కును అభివృద్ధి చేసేందుకు కార్యచరణ
- బొమ్మకల్ ఫ్లైఓవర్‌కు వాల్ పేయింటింగ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ



**కరీంనగర్, మార్చి5 (నినాదం న్యూస్) :** డిల్లీ, హైదరాబాద్ తరహాలో వ్యర్థాలతో వేస్టు టూ వండర్ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీస్కుంటున్నట్లు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ తెలిపారు. స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా.. నగర సుందరీకరణ నేపథ్యంలో బుధవారం రోజు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఎన్విరా న్మెంటల్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అధికారులతొ కలిసి నగరంలో పర్యటించారు. నగరంలోని అల్కపురి పార్కు, శ్రీనగర్ పార్కుతొ పాటు నగరపాలక సంస్థ పలు పార్కు స్థలలాను సందర్శించి... వేస్టు వండర్ పార్కు అభివృద్ధి కోసం స్థల పరిశీలన చేశారు. చెడిపోయిన వస్తువుల వ్యర్థాలతో పార్కును అభివృద్ధి చేయాలనే ఆలోచనలో భాగంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వేస్టు టూ వండర్ పార్కు అభివృద్ధి కోసం స్థలం ఎంపిక చేసి... ప్రణాళికలు సిద్దం చేయాలని ఆదేశించారు. నగరంలోని బొమ్మకల్ ఫ్లై ఓవర్ వంతెనను సంద ర్శించి... అందమైన చిత్రాలు, బొమ్మలతో వాల్ పేయింట్ చేసేందుకు చర్యలు తీస్కోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సంధర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... చెడిపోయిన వివిధ రకాల వస్తువుల వ్యర్థాలతో " వేస్టు టూ వండర్ " పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. పార్కు సుంధరీకరణ కు సంబంధించి పలు పార్కులు, పార్కు స్థలాను సందర్శించామని తెలిపారు. త్వరలోనే పార్కులను ఎంపిక చేసి వేస్టు టూ వండర్ పార్కు ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వేస్టు టూ వండర్ పార్కులో అరుదైన జంతువులు, పక్షులు, రకరకాల శిల్పాలు, ప్రాముఖ్యతను తెలియజేసే వివిధ రకాల ఆకృతులను వ్యర్థాలతో ఏర్పాటు చేసి పార్కును అహ్లాదంగా మార్చడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే పార్కు ఏర్పాటుకు సంబంధించి చర్యలు తీస్కోని... ప్రజలకు వేస్టు టూ వండర్ పార్కును అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అంతే కాకుండా బొమ్మకల్ ఫ్లైఓవర్ వంతెనకు అందమైన చిత్రాలు, బొమ్మలతో వాల్ పేయింటింగ్ చేసేందుకు అధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

# ఆయారే హోలీ

## జాజిరి.. జాజిరి పల్లెల్లో పాటల సందడి

చిన్నపిల్లల దగ్గర నుంచి పండు ముసలోళ్ల వరకు అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే రంగుల పండుగ హోలీ. పల్లెల్లో ఈ పండుగకు నెల రోజుల నుంచే సంబురాలు మొదలైతయ్. గోగుపూలు తెచ్చి రంగు చేసుడు, రాత్రిపూట కోలలు ఆడుతూ మస్తు సంబురాలు చేసుకుంటరు. ఒక్కో దగ్గర ఒక్కో తీర్ల ఈ రంగుల పండుగను చేసుకుంటరు.

*జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):*



**- పల్లెల్లో జాజిరి..జాజారి..!**

పల్లెల్లో కాముడి ఆటలు సందడి రేపుతున్నయి. హోలీకి ముందు తొమ్మిది రోజుల నుంచే పిల్లల నుంచి పెద్దల వరకు సంబురాలు చేసుకుంటున్నరు. రోజు సాయంత్రం పూట కోలల చప్పుళ్లతో పల్లెలు పాటల సందడితో మారుమ్రోగుతున్నయి. జాజిరి పాటలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తున్నయి. ''రింగుడు బిల్లా రూపాయి దండా.. దండ కాదురా దామెర మొగ్గ...ఆ గుండు ఈ గుండు ఇత్తడి గుండు.. గుండువోయి గండి మీద మోతలు పెట్టి....కోతి పుట్టుదెండుకు కొమ్మలెక్కెతందుకు''.మల్లె చెట్టు కింది మదానో నావయ్యాలి..అంటూ పల్లెల్లో రాత్రి పూట పాటల సందడి అందరిని ఆకట్టుకుంటున్నయి. హోలీ పండుగకు ముందు నుంచే జాజిరి ఆటలు పల్లెల్లో కొత్త సందడిని సంతరించుకుంటున్నయి. హోలికి ముందు తొమ్మిది రోజుల పాటు పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా కులమతాలకతీతంగా ఆడుకునే కాముడి అటలతో ప్రతి వాడ హోరెత్తుతున్నది. ఈ నెల 13న కామ దహనం, 14న హోలీ పండుగ జరుపుకోనున్నరు. ఇప్పటికే పల్లెల్లో జాజిరి ఆటలు మొదలై రోజూ సాయంత్రం కోలల చప్పుళ్ళతో జాన పదాలు వినిపిస్తున్నయి.

**- అనాదిగా వస్తున్న ఆచారం..!**

మగ పిల్లలు కోలలతో, ఆడ పిల్లలు చప్పట్లతో పాటలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతూ ఆడుకుంటున్నరు. తొమ్మిది రోజుల పాటు ఊర్లో ఇంటింటా సేకరించిన వడ్లు, మక్కలు, బియ్యం వంటివి ఆఖరి రోజు వాటిని దుకాణంలో అమ్ముకుని వచ్చిన డబ్బులతో తెల్లారి హోలీ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. జాజిరి ఆట చివరి రోజు గ్రామ కూడలిలో కామ దహనం చేస్తరు. అందులో మగ పిల్లలు కోలలు, ఆడపిల్లలు పిడకలు వేస్తరు.





**- లంబాడీలకు ప్రత్యేకం..!**

ముఖ్యంగా లంబాడీలు (బంజారా) చేసుకునే హోలీ పండుగ.. కాస్త డిఫరెంట్ ఉంటది. హోలీ పండుగ వచ్చిందంటే తండాల్లో లంబాడీలు వారం రోజుల నుంచే 'గేర్ వగావో' ఆడుతరు. అంటే. బతుకమ్మ ఆటలాగ ఆడుతూ పాటలు పాడుతరు. ఇంటింటికీ తిరిగి చందాలు అడుగుతరు. ఆ డబ్బుతో మేకపోతులు కొని హోలీ రోజు తండా పెద్ద (నాయక్) ఇంటి దగ్గర మేకపోతును బలిస్తరు. తర్వాత లంబాడా నృత్యాలు చేసి సొళాయి వండుకుని తింటరు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం తండాల్లో ఇంకా కొనసాగుతున్నది. ఇందులో ప్రత్యేకమైన మరో ఆచారం కూడా ఉంది. తండాలో సంతానం లేని ఆడవాళ్లు నీతి, నిజాయితీతో బతికే వాళ్ల ఇంటి ముందు పాటలు పాడి నృత్యం చేస్తరు.

అప్పుడు ఆ ఇంటి యజమాని సంతానం కలుగుగాక అని దీవిస్తడు, అలా దీవిస్తే వాళ్లకు పిల్లలు పుడతారని నమ్ముతరు. హోలీ పండుగకు ముందు రోజు రాత్రి పది గంటల నుంచి కామదహనం చేస్తరు. ఆ బూడిదను దిష్టి తగలకుండా నుదుట పెట్టుకుంటరు. ఇట్ల కులమతాలకతీతంగా మారుమూల గ్రామీణ పల్లెల్లో హోలీ పండుగను అంగరంగవైభవంగా జరుపుకుంటరు.

# కసూరి మేథీ

## అద్భుతమైన లాభాలను అందిస్తుంది..!

*మెంతులనే కాదు, మెంతి ఆకులను కూడా మనం ఆహారంలో భాగంగా వాడుతుంటాం. మెంతి ఆకులతో కూర, పప్పు, చారు వంటివి చేస్తుంటారు. ఇతర కూరల్లోనూ మెంతి ఆకులను వేస్తుంటారు. ఈ ఆకు చేదుగా ఉంటుందని చాలా మంది వాడరు. కానీ మెంతి ఆకుల్లో అనేక ఔషధగుణాలు దాగి ఉన్నాయి. ఇక మెంతి ఆకులను ఎండబెట్టి కసూరి మేథీ తయారు చేస్తారు. ఎండిన మెంతి ఆకులనే కసూరి మేథీ అంటారు. కసూరి మేథీని ఉత్తర భారతానికి చెందిన వారు ఎక్కువగా వంటల్లో వేస్తుంటారు. కసూరి మేథీతోనూ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు వ్యాధులను తగ్గించడంలో కసూరి మేథీ అద్భుతంగా పని చేస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.*



**ఎముకల ఆరోగ్యానికి..**

కసూరి మేథీలో క్యాల్షియం, ఇతర ముఖ్యమైన మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. కసూరి మేథీలో ఉండే మెగ్నిషియం ఎముకలను దృఢంగా మారుస్తుంది. మనం తిన్న ఆహారాల్లో ఉండే క్యాల్షియంను శరీరం సరిగ్గా శోషించుకోవాలంటే అందుకు మెగ్నిషియం అవసరం అవుతుంది. కసూరి మేథీలో ఉండే మెగ్నిషియం మన శరీరంలో క్యాల్షియం శోషణకు పనిచేస్తుంది. దీంతో ఎముకలకు క్యాల్షియం లభించి ఆరోగ్యంగా ఉంటాయి. కసూరి మేథీకి శరీరంలో వేడిని పెంచే గుణం ఉంటుంది. కనుక చలి ప్రాంతాల్లో ఉన్నవారు దీన్ని ఎక్కువగా తింటారు. కసూరి మేథీ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చలిగా ఉన్న వాతావరణంలో దీన్ని తింటే ఎంతో మేలు చేస్తుంది.

**జీర్ణ సమస్యలు, షుగర్‌కు..**

కసూరి మేథీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు ఉన్నవారు కసూరి మేథీని తింటుంటే ప్రయోజనం ఉంటుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. కసూరి మేథీలో ఉండే పలు సమ్మేళనాలు మన శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీంతో కీళ్ల నొప్పులు, వాపులు ఉన్నవారికి ఉపశమనం లభిస్తుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. కసూరి మేథీలో రుచిగా చేదుగా ఉంటుంది. కనుక ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు రోజూ కసూరి మేథీని తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఇది శరీరం ఇన్సులిన్ ను గ్రహించేలా చేస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి.

**అధిక బరువు తగ్గేందుకు..**

అధిక బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా కసూరి మేథీని తమ ఆహారంలో భాగం చేసుకోవాలి. కసూరి మేథీలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీని వల్ల ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. చర్మ సంరక్షణకు కూడా కసూరి మేథీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని డీహైడ్రేషన్‌కు గురి కాకుండా రక్షిస్తాయి. దీంతో చర్మం పొడిబారకుండా తేమగా, తాజాగా, మృదువుగా ఉంటుంది. చర్మ కాంతి పెరుగుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. చర్మం సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటుంది. ఇలా కసూరి మేథీతో మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# మార్కెట్

## షోరూంలో కార్ లేదా బైక్ కొంటున్నారా..

### ఈ ఛార్జీలు ఎప్పుడూ చెల్లించకండి..

మీరు షోరూంకు వెళ్లి కారు లేదా బైక్ కొనుగోలు చేసినప్పుడు డీలర్ బిల్లులో అనేక వస్తువులకు అదనపు ఛార్జీలు జోడించే అవకాశం ఉంది. డీలర్లు మీకు తెలియకుండానే బిల్లులో చేర్చే అనేక ఛార్జీల వివరాలు ఇక్కడ ఉన్నాయి. కస్టమర్ల నుంచి షోరూం వాళ్లు వేటిపైన హిడెన్ ఛార్జీలు వసూలు చేస్తారో చాలా మందికి తెలియదు. అందుకే, మీరు చెల్లించాల్సిన అవసరం లేని ఛార్జీల గురించి మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం. వాహనం కొనుగోలు చేసేటప్పుడు కస్టమర్లపై డీలర్ వేసే అదనపు ఛార్జీల లిస్ట్ మీకోసం..

నిర్వహణ లేదా లాజిస్టిక్స్ ఛార్జీలు.. వాహనం నిర్వహణ, రవాణా లేదా లాజిస్టిక్స్ కోసం ఖర్చు చేసే డబ్బును కవర్ చేయడానికి చాలా మంది డీలర్లు అదనపు రుసుములను వసూలు చేస్తారు. వాస్తవానికి ఈ రుసుము వాహనం ధరలో చేర్చబడి ఉంటుంది. మళ్లీ మీరు దాని కోసం విడిగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ రకమైన ఛార్జీని డీలర్ హ్యాండ్లింగ్ ఛార్జ్ అని కూడా పిలుస్తారు. ఇది చట్టవిరుద్ధమైన చెల్లింపు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం డీలర్ ఏజెంట్లు ఫీజులు లేదా సేవా ఛార్జీల రూపంలో అదనపు డబ్బును వసూలు చేస్తారు. అయితే, రుసుములను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. మీరు వద్దకు వెళ్లి కూడా చెల్లించవచ్చు. డీలర్ ఎక్కువ వసూలు చేస్తే మీరు జాగ్రత్తగా ఉండాలి.

ఉపకరణాల రుసుము.. చాలా మంది డీలర్లు వాహనంతో వచ్చే సీట్ కవర్లు, మ్యాట్స్ లేదా మడ్ ఫ్లాప్స్ వంటి ఉపకరణాలకు డబ్బు వసూలు చేస్తారు. అవి తప్పనిసరి అని చెబుతారు. ఇది పూర్తిగా ఆప్షనల్. మీ ఎంపిక, బడ్జెట్ ప్రకారం మీరు బయటి నుండి వీటిని మీరు కొనుగోలు చేయవచ్చు. దీనికి అదనపు డబ్బు చెల్లించాల్సిన పనిలేదు.

వడ్డీరేట్లలో మోసాలు.. ఫైనాన్స్ ద్వారా వాహనాలను కొనుగోలు చేసే వారికి డీలర్లు.. ఫైనాన్స్ కంపెనీల సహకారంతో వడ్డీ రేట్లపై అదనపు ఛార్జీలను జోడిస్తారు. మీరు బ్యాంకు లేదా ఫైనాన్స్ కంపెనీని నేరుగా సంప్రదించి ఛార్జీల గురించి పూర్తి సమాచారం పొందడం మంచిది. కనీసం రెండు నుండి మూడు బ్యాంకుల ఫైనాన్స్ ఆఫర్ల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించండి. మీకు ప్రయోజనం అనిపించే బ్యాంకు నుండి రుణం తీసుకోండి. మీకు అవకాశం ఉంటే డీలర్ ద్వారా ఫైనాన్సింగ్ చేయడాన్ని నివారించండి.

బీమాపై అధిక ఛార్జీ.. డీలర్ అందించే బీమా పాలసీ ఛార్జీలు తరచుగా మార్కెట్ కంటే ఎక్కువగా ఉంటాయి. మీరు వివిధ బీమా కంపెనీల రేట్లను మీరే పోల్చి చూసి మంచిది, సరసమైన ధరకే వచ్చే పాలసీని ఎంచుకోండి. ఇలా చేయడం ద్వారా మీరు బీమా పాలసీ ఖర్చును కూడా ఆదా చేసుకోవచ్చు.

ప్రీ-డెలివరీ తనిఖీ ఛార్జీలు.. ప్రీ-డెలివరీ తనిఖీ అనేది వాహన నాణ్యతను తనిఖీ చేసే ప్రక్రియ. ఇది డీలర్ బాధ్యత. దీని కోసం డీలర్‌కు ఎటువంటి ప్రత్యేక ఛార్జీ చెల్లించకూడదు. కొంతమంది డీలర్లు ఈ ప్రక్రియ కోసం డబ్బు కూడా అడుగుతారు. ఇది తప్పు.

ఫాస్ట్‌ట్యాగ్‌పై అదనపు ఛార్జీలు.. ఫాస్టాగ్ రుసుమును ప్రభుత్వం నిర్ణయిస్తుంది. చాలా మంది డీలర్లు దీనిని జారీ చేయడం పేరుతో ఎక్కువ డబ్బు వసూలు చేస్తారు. ఇది తప్పు. ఫాస్టాగ్ కోసం మీరు నిర్దేశించిన రుసుము కంటే ఎక్కువ చెల్లించకూడదు.

## వరుస నష్టాల నుంచి ఉపశమనం



వరుస నష్టాలతో కుదేలైన దేశీయ సూచీలకు బుధవారం కాస్త ఉపశమనం లభించింది. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను ఆర్జించాయి. కెనడా, మెక్సికోలపై అమెరికా విధించిన 25 శాతం సుంకాలను తగ్గించనుండడం, ఆసియా మార్కెట్ల ర్యాలీ పాజిటివ్ సెంటిమెంట్‌ను పెంచాయి. దీంతో దేశీయ సూచీలలో కూడా లాభాల కళ కనిపించింది. ఈ లాభాలతో సెన్సెక్స్ మళ్లీ 73, 500 పైకి ఎగబాకింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు ఏకంగా రెండు శాతం పెరిగాయి. మంగళవారం ముగింపు (72, 989)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం ఫ్లాట్‌గా రోజును ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 100 పాయింట్లు పెరిగి 73, 933 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 740 పాయింట్ల లాభంతో 73, 730వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. ఏకంగా 254 పాయింట్ల లాభంతో 22, 337 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ, కోఫోర్జ్ లిమిటెడ్ షేర్లు లాభాలను ఆర్జించాయి. బీఎస్ఈ లిమిటెడ్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, వోల్టాస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1160 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 244 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.95 గా ఉంది.

## బిజినెస్‌లో రాణించేందుకు మహిళలకు సువర్ణావకాశం



భారతదేశంలో మహిళా పారిశ్రామిక వేత్తలు అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తున్నారు. అనేక రాష్ట్రాలు మహిళలు తమ వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవడంలో సహాయపడటానికి కార్యక్రమాలను ప్రారంభించాయి. వివిధ వేదికల ద్వారా మహిళలు తమ కెరీర్‌లను పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తోంది. మహిళా వ్యవస్థాపకులకు మార్కెట్‌ను కనుగొనడం పెద్ద సవాలు. ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ మహిళా పారిశ్రామికవేత్తల నుండి ప్రభుత్వ విభాగాలకు రూ.3000 కోట్ల విలువైన వస్తువులు, సేవలను అందిస్తుంది. స్టాండ్-అప్ ఇండియా, కింద రూ.2 కోట్ల రుణం మహిళలకు సులభమైన ఆర్థిక సహాయం అందించే మరో రెండు పథకాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాలకు ఉత్పత్తులు, సేవలను సేకరించే పోర్టల్, ల నుండి 25 శాతం కొనుగోళ్లను రిజర్వ్ చేసింది. ఇందులో 3 శాతం మహిళలు నడిపే MSMEల నుండి వస్తాయి. ఇది మహిళలకు 3000 కోట్ల రూపాయల అవకాశాన్ని కల్పిస్తోంది. సాధారణ ప్రజలకు, ప్రభుత్వ విభాగాలకు అందుబాటులో ఉన్న GeM పోర్టల్, MSMEలతో సహా 25 ప్రసిద్ధ కొనుగోలుదారులను లక్ష్యంగా చేసుకుంది. అంతేకాకుండా మహిళా పారిశ్రామికవేత్తలకు సులభంగా ఆర్థిక సహాయం అందించే పథకాలు కూడా ఉన్నాయి. స్టాండ్-అప్ ఇండియా పథకం కింద ప్రభుత్వం SC/ST, మహిళా వ్యవస్థాపకులకు పూచీకత్తులు లేకుండా రూ. 2 కోట్ల వరకు రుణాలను అందిస్తుంది. దీని ద్వారా 5 లక్షల మంది వ్యవస్థాపకులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. మహిళలు తమ వెంచర్‌ను MSMEగా నమోదు చేసుకుంటే బ్యాంకులు ఈ రుణాన్ని అందిస్తాయి. "మహిళా వ్యవస్థాపకులు నిర్వహించే రిజిస్టర్డ్ MSMEలు GeM పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. వారు తయారు చేసిన వస్తువులు, అందించే సేవల వివరాలను అందించాలి. ఇది కేంద్ర ప్రభుత్వం సేకరణ కోసం. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళా వ్యవస్థాపకులకు ఇలాంటి సౌకర్యాలను అందిస్తున్నాయి" అని FISME సెక్రటరీ జనరల్ అనిల్ భరద్వాజ్ అన్నారు. క్రెడిట్ గ్యారెంటీ పథకం కింద సూక్ష్మ లేదా చిన్న వ్యాపారాన్ని స్థాపించడానికి కొత్త మహిళా వ్యవస్థాపకులు పూచీకత్తులు లేకుండా బ్యాంకు క్రెడిట్‌ను పొందవచ్చు. ఈ పథకం కింద మహిళలు రూ. 5 లక్షల రుణంలో 90 శాతం వరకు పొందుతారు భరద్వాజ్ అన్నారు.

## బంగారంపై మీరు ఎంత రుణం తీసుకోవచ్చు..?



బంగారం అనేది మీకు ఆర్థిక అవసరం ఉన్న సమయాల్లో రుణం పొందడంలో సహాయపడే విలువైన ఆస్తి. అనేక బ్యాంకులు, లు (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు) బంగారు రుణాలను అందిస్తాయి. దీనివల్ల అత్యవసర నగదు అవసరాలకు సులభంగా అందుబాటులో ఉంటాయి. విస్తృతమైన డాక్యుమెంటేషన్, క్రెడిట్ తనిఖీలను కలిగి ఉండే వ్యక్తిగత రుణాల మాదిరిగా కాకుండా, బంగారు రుణాలు బంగారం ద్వారానే సురక్షితం చేయబడతాయి. దీనివల్ల నిధులు త్వరగా లభిస్తాయి. న్యాయమైన రుణ విధానాలను నిర్ధారించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారు రుణాలను నియంత్రిస్తుంది. రుణదాతలు లోన్-టు-వాల్యూ నిష్పత్తి ఆధారంగా రుణ మొత్తాన్ని నిర్ణయిస్తారు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం.. బ్యాంకులు, లు బంగారం మార్కెట్ విలువలో 75% వరకు రుణం ఇవ్వవచ్చు. అంటే మీ బంగారం రూ. లక్ష విలువైనది అయితే మీరు రూ. 75,000 వరకు రుణం పొందవచ్చు. అయితే, కొంతమంది రుణదాతలు వారి రిస్క్ అసెస్‌మెంట్ పాలసీలను బట్టి తక్కువ మొత్తాలను అందించవచ్చు. "బంగారం విలువ ప్రస్తుత మార్కెట్ ధర ఆధారంగా ఉంటుంది. బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి అందుకే రుణ మొత్తం తదనుగుణంగా మారవచ్చు. రుణగ్రహీతలు తమ తాకట్టు పెట్టిన బంగారానికి సాధ్యమైనంత ఉత్తమ విలువను పొందడానికి రుణం కోసం దరఖాస్తు చేసుకునే ముందు తాజా బంగారు రేట్లను తనిఖీ చేయాలి" అని ఆదిల్ శెట్టి అంటున్నారు.

## కొత్త టెక్నాలజీతో టీవీఎస్ జూపిటర్

టీవీఎస్ విడుదల చేసిన లేటెస్ట్ జూపిటర్ 110 స్కూటర్ లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ముఖ్యంగా ఓబీడీ2బి ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించారు. ఈ స్కూటర్ ధర రూ.76,691 (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. ఓబీడీ2బీ కి అనుగుణంగా ఉన్న వాహనాల శ్రేణి సెన్సార్ టెక్నాలజీ, ఆన్ బోర్డు సామర్థ్యాలతో ఉంటుంది. గాలి – ఇంధన మిశ్రమం, ఇంజిన్ ఉష్ణోగ్రత, ఇంధన పరిమాణం, ఇంజిన్ వేగానికి సంబంధించిన డేటాను సేకరించే సెన్సార్లను అమర్చుతారు. ఆన్ బోర్డు ఇంజిన్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ)తో వాహనాలు జీవితకాలమంతా శుభ్రంగా, పర్యావరణ అనుకూలమైన రీతిలో పనిచేస్తాయి. అలాగే మన్నిక కూడా చాలా మెరుగ్గా ఉంటుంది. టీవీఎస్ కంపెనీ గతేడాది జూపీటర్ ఇంజిన్ ను నవీకరించింది. ఫ్యూయల్ ఇంజెక్షన్ టెక్నాలజీ కలిగిన 113.3 సీసీ ఇంజిన్ ఏర్పాటు చేసింది. దాని నుంచి 5000 ఆర్పీఎం వద్ద 7.91 బీహెచ్పీ గరిష్ఠ శక్తి, 9.2 ఎన్ఎం టార్క్ ను విడుదల అవుతుంది. గంటకు గరిష్టంగా 82 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడుతుంది. ఆకర్షణీయమైన రంగుల్లో టీవీఎస్ జూపిటర్ ఎంతో ఆకట్టుకుంటోంది. డాన్ బ్లూ మ్యాట్, గెలాక్టిక్ కాపర్ మ్యాట్, టైటానియం గ్రే మ్యాట్, స్టార్ లైట్ బ్లూ గ్లోస్, లూనార్ వైట్ గ్లోస్, మీటియోర్ రెడ్ గ్లోస్ రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. కొత్త జూపిటర్ స్కూటర్ లో కస్టమర్లకు ఉపయోగపడే అనేక ఫీచర్లు ఏర్పాటు చేశారు. రెండు హెల్మెట్లు పెట్టుకోగల అండర్ సీట్ స్టోరేజీ, మొబైల్ పరికరాలను చార్జింగ్ చేసుకోవడానికి యూఎస్ బీ పోర్టు, ఇంధన ట్యాంకుకు బయట మూత, ఎల్ఈడీ లైటింగ్ ఆకట్టుకుంటున్నాయి. బ్లూ టూత్ కనెక్టివిటీ, వివిధ అప్లికేషన్లకు మద్దతు ఇచ్చే ఆధునిక డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ అమర్చారు. టీవీఎస్ ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్, ఆటోమేటిక్ టర్న్ ఇండికేటర్లు, డిస్టెన్స్ టు ఎంపీ ఇండికేటర్, వాయిస్ కమాండ్ సామర్థ్యం, హాజార్డ్ ల్యాంపులు, ఫాలో మీ హెడ్ ల్యాంప్‌లను అమర్చారు. టీవీఎస్ జూపిటర్ నాలుగు రకాల వేరియంట్లలో లభిస్తుంది. ప్రారంభ డ్రమ్ వేరియంట్ ధర రూ.76,691. అన్నింటిలో ఇదే అతి తక్కువ ఖరీదైన మోడల్. అలాగే డ్రమ్ వేరియంట్ ధర రూ.82,441 పలుకుతోంది. దీనిలో మెరుగైన లుక్, మన్నిక కోసం అల్లాయ్ వీల్స్ ఏర్పాటు చేశారు. ఇక డ్రమ్ ఎస్ఎక్స్ వేరియంట్ రూ.85,991కు అందుబాటులోకి వచ్చింది. దీనిలో అదనపు స్టైలింగ్, కన్వీనియన్స్ ఫీచర్లు ఉన్నాయి. చివరిదైన డిస్క్ ఎస్ఎక్స్ వేరియంట్ రూ.89,791 పలుకుతోంది. దీనిలో ఫ్రంట్ డిస్క్ బ్రేక్ అమర్చారు.



# సొమ్ము కార్మికులది సోకు కాంట్రాక్టర్‌ది

- మున్సిపల్ కార్మికులతో వనమహోత్సవం పనులు
- టెండరు పనుల్లో గుత్తేదారు గోల్మాల్
- కార్మికులతో మట్టిమోయించిన వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసన
- సఖి కేంద్రంలో హరితహారం అవకతవకలపై నినాదం ప్రత్యేక కథనం

**పెద్దపల్లి, మార్చి05(నినాదం):** మునిసిపాల్ అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టరుల పాలిట కాసులపంటగా మారుతోంది.టెండర్ల ద్వారా గెలుచుకున్న పనులను మునిసిపల్ శాఖకు చెందిన పారిశుధ్య కార్మికులతో చేయిస్తున్న కాంట్రాక్టరు సర్కారు సొమ్మును తెగమింగుతున్న వైనం బయటపడింది.అధికారుల కనుసన్నుల్లోనే ఈ తతంగం నడుస్తున్నదనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నా. సంభందిత అధికారులు మాత్రం తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది..జిల్లా కేంద్రంలో ఉన్న సఖి కేంద్రంలో హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ విషయంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతిపై ప్రత్యేక కథనం..





**కార్మికులతో పనులు..**
వనమహొత్సవంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో అధికారులు గతంలో మొక్కలు నాటారు.వాటి సం రక్షణ నిర్వహణ బాద్యతలను టెండర్ల ద్వారా కాంట్రాక్టరులకు అప్పించారు. అయితే, టెండరు గెలిచిన కాంట్రాక్టరు తన కార్మికులతో పనులు చేయించాల్సి ఉంటుంది.అయితే జిల్లాకేంద్రం లోని సఖి కేంద్రంలో మొక్కల సం రక్షణ బాద్యతలను నాగేందర్ అనే కాంట్రాక్టరుకు అప్పగించారు.అయితే అధికారులను మచ్చిక చేసుకున్న కాంట్రాక్టరు సదరు పనులను మునిసిపల్ కార్మికులతో చేయించడం జరిగింది.వారితో మట్టి మోయించి మొక్కలకు పోయించడం వివాదస్పధంగా మారింది.

**బిల్లులు పొందడం కొరకు..**
మునిసిపల్ కార్మికులతో పనులు చేయించిన కాంట్రాక్టరు లెక్కల్లో మాత్రం ప్రయివేటు లేబర్లను వినియోగించినట్లు చూపుతున్నట్లు తెలిసింది. తద్వారా ప్రభుత్వం నుండి పెద్ద మొత్తంలో బిల్లులు పొందుతున్నట్లు సమాచారం.టెండరు పొందిన నాటి నుండి ఇదే తంతు కొనసాగుతుందని,అవినీతి మునిసిపల్ అధికారుల వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోందని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పేర్కొన్నారు.

**చెట్లు నాటడం పక్కనపెట్టి..**
పెద్దపల్లి మునిసిపల్ విభాగంలో హరిత హారం కార్మికులు కేవలం చెట్లు నాటే నిర్వహణ వంటి పనులు మాత్రమే చేయాలి.కానీ,అధికారుల అలసత్వం,చూసిచూడనట్లు వ్యవహరించడం, కాంట్రాక్టరులతో కుమ్మక్కు కావడం వల్ల పారిశుధ్య కార్మికులను గుత్తేదారుల టెండరు పనులకు వినియోగించడం చర్చనీయాంశంగా మారింది.

**ఆరోపణల్లో వాస్తవం లేదు..**
**ఆకుల వెంకటేష్, మునిసిపల్ కమీషనరు, పెద్దపల్లి**
పారిశుధ్య కార్మికులతో గుత్తేదారుకు చెందిన టెండరు పనులు చేయిచడంలో ఎలాంటి వాస్తవం లేదు. ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదనీ దాటవేశారు.

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**సుల్తానాబాద్, మార్చి05 (నినాదం న్యూస్) :** సుల్తానాబాద్ మండలంలో ఇంటర్మీడియట్ ప్రథ మ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల,గర్రెపల్లి గ్రామంలోని సాంఘిక సం క్షేమ గురుకుల బాలికల కళాశాల,రెండు పరీక్ష కేం ద్రాల్లో నిర్వహించిన ఇంటర్ ప్రథమపరీక్షలు ప్రశాం తంగా సాగాయి.మొదటి రోజు విద్యార్థులు మొ త్తం 652 మందికి గాను 636 మంది విద్యార్థులు హాజరుకాగా16 మందివిద్యార్థులు గైర్హాజరయ్యా రు.ఈ పరీక్షలకు గాను చీఫ్ సూపర్డెంట్ గా ప్రభు త్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర రె డ్డి, గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గిరిజ,డిపార్ట్మెంటల్ అధికారి గా హరికృష్ణ వ్యవహరించారు.కాగా పరీక్ష కేంద్రాల పరిధిలో ఎస్సై శ్రావణ్ కుమార్ తన సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీనిర్వహించిపరీక్ష కేంద్రాల్లోకి అను మతిచ్చారు.పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల మొబైల్ ఫోన్లను అనుమతించలేదు.మొదటిరోజు పరీక్ష లు ప్రశాంతంగా ముగిశాయి.

## అట్టహాసంగా సింగరేణి పాఠశాల వార్షికోత్సవం



**8ఇంక్లైన్ కాలనీ, మార్చి5 (నినాదం న్యూస్) :** సింగరేణి కాలిరీస్ ఉన్నత పాఠశాల, సెక్టార్ -3, యందు తేది: 04-03-2025 మంగళవారం రోజున పాఠశాల 48 వ వార్షికోత్సవం విద్యార్థుల కేరింతల మధ్య అట్టహాసంగా సాగింది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జి శ్రీనివాస్ పాఠశాల కరెస్పాండంట్ /డివై. జి. మ్.(పర్సనల్ ) -2 ఏరియా అనిల్ కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమానికి శ్రీదేవి -శ్రీనివాస్, అలాగే కవిత -అనిల్ కుమార్ విచ్చేసి వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటిల్లో (వ్యాసరచన పాటీలు, డ్రాయింగ్ పోటీలు, స్పోర్ట్స్ గేమ్స్) గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వారి ఆటపాటలతో, నృత్యాలతో అందరిని అలరించారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి5 (నినాదం న్యూస్):** విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందిస్తామని విద్యుత్ శాఖ ఏస్ ఈ గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్ సబ్ స్టేషన్ లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫుర్ ఉండగా ప్రజల అవసరాల దృష్ట్యా 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫుర్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాక జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రత్యేకంగా బ్రేకర్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఏడిఈ మోహన్ రెడ్డి, డిఈ కైసర్, ఏఈ ఖలీల్, నస్పూర్ ఏఈ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముఠా



**చెన్నూర్ ఫిబ్రవరి 5 (నినాదం న్యూస్) :** చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామ సమీపంలో గంజాయి సేవిస్తూన్న10 మంది యువకులను పోలీసులు పట్టుకున్నారు. చెన్నూరు సిఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం కిష్టంపేట గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా 10 మంది యువకులు గంజాయి సేవిస్తున్నారు. వెంటనే యువకులను అదుపులో తీసుకొని వారి వద్ద సుమారు 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరు మైనర్లు కాగా ఒకరు పరారీ లో ఉన్నట్లుగా పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి సేవించినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ రవీందర్ హెచ్చరించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి గెలుపు



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి5 (నినాదం న్యూస్):** కరీంనగర్-నిజామాబాద్-మెదక్-అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు విజయం ఎవరికి వరిస్తుందో అన్న ఉత్కంఠకు తెరపడింది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలు పొందారు. రెండవ ప్రాధాన్యత ఓట్లతోనే ఘన విజయం సాధించారు. బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోరు నువ్వా, నేనా అన్నట్లు సాగింది. బిజెపి అభ్యర్థి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి రెండో స్థానం, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మూడో స్థానంలో ఉన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడంతో బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

- ఇంటర్ జిల్లా అధికారి కల్పన
- ఇంటర్ మొదటి పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరు

**పెద్దపల్లి, మార్చి05(నినాదం) :** జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని,ఈ పరీక్షకు 5341మంది హాజరు కావాల్సి ఉండగా,5154 మంది హాజరు కాగా,187 మంది విద్యార్థి లు గైర్హాజరు అయ్యారని, తొలి రోజు 96 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని,మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎస్టీ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలి

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్

**పెద్దపల్లి, మార్చి05(నినాదం) :** ఎస్టీ క్రీడా పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి,మోడల్ స్పోర్ట్స్ పాఠశాల జాతర్ల, కిన్నెరసాని బాలుర పాఠశాల, ఉట్నూరు బాలుర పాఠశాల, కొత్తగూడెం బాలుర పాఠశాల, ఆసిఫాబాద్ బాలికల పాఠశాల, కాచినపల్లి బాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆగస్టు 31 2025 నాటికి 90 నుంచి 11 సంవత్సరాల లోపు వయసు ఉండాలని,ఎంపిక జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహ దారుఢ్య పరీక్షలనంతరం చేయబడుతుందని అన్నారు ఆసక్తి,అర్హత గల గిరిజన బాలబాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కరీంనగర్ కార్యాలయంలో పని వేళలో సమర్పించాలని,ఇతర వివరాలకు 8686451313 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇటుక బట్టీలో అసలేం జరుగుతోంది

- ఇటుక బట్టిలో కార్మికుడు మృతి
- ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నట్టు..?
- నష్ట పరిహారం చెల్లించాలని బొంకూరి కైలాసం డిమాండ్

**పెద్దపల్లి రూరల్, మార్చి05(నినాదం) :** ఇంటి నిర్మాణం కోసం ఇటుకలు వాడుతుంటారు.ఐతే దీనిని ఆసరాగా తీసుకుని జిల్లాలో ఇష్టారాజ్యంగా,పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు వెలిశాయి.ఎటువంటి పన్నులు, చెల్లించకున్నా కోట్లలో వ్యాపారం జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమి పట్టించుకోరు.పొరుకు రాష్ట్రాల నుండి ఇటుక బట్టిలలో పనిచేసేందుకు కార్మికులను తీసుకొస్తారు.ఈ కార్మికులకు ఏ చట్టాలు వీరికి వర్తించవు.దాదాపుగా ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు చనిపోయినా కూడా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.ఏ.ఎన్.ఆర్ రాంగాపూర్ శివారులోని ఇటుక బట్టిలో గత రెండు నెలలుగా పనులు చేస్తున్న పప్పుల నిశాంత్ (42) అనే ఒడిస్సా కు చెందిన కార్మికుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. ఆ కార్మికుడు మృతి చెందితే కనీసం ఇటుక బట్టి యజమాని రాకుండా ఇటుక బట్టి లో పనిచేసే వేరే కార్మికుడినితో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

**మృతినికి నష్ట పరిహారం చెల్లించాలని బొంకూరి కైలాసం డిమాండ్...**
ఇటుక బట్టిలలో చనిపోయినా కార్మికులను కనీసం వారి కుటుంబానికి అప్పుజెప్పకుండానే పోస్ట్ మార్టం ఇయ్యాక ఇక్కడే పూడ్చి వేస్తున్నారని మండిపడ్డారు.ఏ.ఎన్.ఆర్ ఇటుక బట్టి కి కనీసం ఎలాంటి అనుమతి లేదు.ఐనా అదికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.పొరుగు రాష్ట్రం నుంచి వలస వచ్చిన కార్మికులను ఇటుక బట్టి యజమానులు కర్కశంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతుంటే అధికారులు మాత్రం పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. ఇప్పటికైనా మృతి చెందిన కార్మికుడికి వారి కుటుంబానికి అపాగించి నష్ట పరిహారం చెల్లించాలని కైలాసం డిమాండ్ చేశారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



**సుల్తానాబాద్, మార్చి 05(నినాదం న్యూస్):** మున్సిపల్ కార్మికుల సమస్య లు పరిష్కరించాలి అనిసిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిర సన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇస్తామన్నారు, నేటి వరకు అమలు కాలేదు.అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న మున్సిపల్ కార్మికుల సమ స్యల పరిష్కారానికి చొరవ చూపలేదని అన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికుల పిఎఫ్, ఈఎ స్ఐ సంస్థలకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే చె ల్లించాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు వై ద్య సౌకర్యం అందడం లేదని, పిఎఫ్ డబ్బులు లో న్ తీసుకోవడానికి అవకాశంలేకుండా పోయిందని అని చెప్పారు. పెరిగిన వేతనాల ఎరియర్స్ చెల్లిం చాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యల పరిష్కా రం కోసం గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూపాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలోమున్సిపాలిటీ యూనియన్ నాయ కులు న్యాతరి రమేష్, మల్లేష్, సురేష్, లక్ష్మణ్, రా మ్మూర్తి,లక్ష్మి, శ్రీనివాస్, మధు,నరసింగం తదితరు లు పాల్గొన్నారు.

## తొలి రోజు ప్రశాంతం



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి5 (నినాదం న్యూస్):** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు నిమిషాలు ఆలస్యం నిబంధన ఉన్నప్పటికీ ముందుగానే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా తొలి రోజు 6365 మంది విద్యార్థులకు 6078 అన్ని విద్యార్థులు హాజరయ్యారు. 287 మంది గైర్హాజరు అయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రంలో మొబైల్, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించలేదు. అత్యవసర వైద్య సేవలను నిమిత్తం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూయించి వేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు ఇలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ఆదర్శ దంపతుల స్ఫూర్తిదాయకమైన నిర్ణయం..!

- మరణానంతరం నేత్ర, అవయవ, దేహదానంకు అంగీకారం
- దంపతులను అభినందించిన సదాశయ ఫౌండేషన్



**గోదావరిఖని మార్చి 05 (నినాదం న్యూస్) :** గోదావరిఖనిలోని ఉల్లిగడ్డల బజార్ లో హోల్ సేల్ వ్యాపారం నిర్వహిస్తున్న కొత్త చంద్రప్రసాద్-వరలక్ష్మి దంపతులు బుధవారం స్ఫూర్తిదాయకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. వరలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా తమ ఇద్దరి మరణానంతరం ఇద్దరి నేత్రాలు, అవయవాలు, దేహదానాలను చేస్తామని దంపతులిద్దరూ అంగీకారాన్ని ప్రకటించారు. ఈ సంద్భంగా వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, సదాశయ ఫౌండేషన్ జాతీయ ముఖ్య సలహాదారులు, ఎస్ ఎం ఎస్ ప్లాంట్ మాజీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నూక రమేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసు కు దంపతులు వారి అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేత్ర అవయవాలు దానం చేసి పలువురికి పునర్జన్మ కల్పించాలని సంకల్పించడం, అలాగే తమ దేహాలను వైద్య విద్యార్థుల పరిశోధన కోసం దోహద పడాలని తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అనంతరం దంపతులకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రసాద్ తల్లిదండ్రులు కొత్త రాజయ్య-వజ్రమ్మతోపాటు బంధువులు గుండా శంకరయ్య, గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను.. లక్ష్యానికి దూరం

- జమ అయ్యింది 40 శాతం
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు




**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 5 (నినాదం న్యూస్):** 2024-25 ఆర్థిక సంవత్సరం గడువు సమీపించడంతో మంచిర్యాల కార్పొరేషన్ పన్ను వసూలు సవాల్ గా మారాయి. ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులే కార్పొరేషన్ ప్రధాన వనరు. అభివృద్ధి, మౌలిక వసతులను కోరుకుంటున్న ప్రజలు ఆస్తి పన్ను చెల్లించడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనికి తోడు పన్నుల వసూళ్ల విషయమైన అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. కోట్ల రూపాలు రావాల్సి ఉన్న వసూళ్లపై యంత్రాంగం అంతగా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పారిశుద్ధ్య కార్మికుల వారి జీతభత్యాలు, అభివృద్ధి పనులకు, కార్పొరేషన్ నిర్వహణ ఇతర పనులకు పనులకు ఎంతో కీలకం. ఈ ఆర్థిక సంవత్సరం మరో 25 రోజుల్లో ముగియనుండగా నిర్దేశించిన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారని ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు, సిబ్బంది మాత్రం ఆస్తి పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు ఎన్ని ఆటంకాలు ఎదురైనా తమ ముందున్న లక్ష్యాన్ని అధికమించేందుకు ప్రయత్నం మొదలు పెట్టారు.

**నిర్దేశించిన లక్ష్యం..**
మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్ గా మార్చి నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని 5 గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. దీంతో కార్పొరేషన్ లో 45,873 నివాస గృహాలు ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం రూ.26.28 కోట్లు ఆస్తి పన్నులు డిమాండ్ ఉంది. కాని కేవలం రూ. 10.61 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. దీంతో రూ.15 67 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం 40 శాతమే వసూలు చేసిన అధికారులు మార్చి 31వ తేదీలోపు మొత్తాన్ని వసూలు చేసేందుకు రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుంటే వంద శాతం వసూలు కానుంది.

**రెడ్ నోటీసులు జారీ..**
మంచిర్యాల కార్పొరేషన్ ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు కమిషనర్ శివాజి ఆధ్వర్యంలో అధికారుల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆస్తి పన్నుల వసూల కోసం యంత్రాంగం ముమ్మరం చేసింది. మొండి బకాయిలు ఉన్న ఇంటికి రెడ్ నోటీసులు అందజేయనున్నారు. 3 రోజులో పన్నులు చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేయనున్నారు.

**ప్రత్యేక ప్రణాళికతో సాగుతున్నాం : శివాజీ, మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్**



మంచిర్యాల కార్పొరేషన్ లో ఇతరాత్ర పనులు ఉన్నప్పటికీ తమ అధికారులు, సిబ్బంది అస్తిపన్ను వసూల్ పై దృష్టి సారించారు. పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పన్ను వసూలు చేస్తున్నం. 100 శాతం పన్నుల వసూలు లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. మొండి బకాయి దారుల వద్దకు వెళ్లి చెల్లింపు ఆవశ్యకతను వివరిస్తున్నాం. గడువు ముగియగానే ఇంటిని జప్తు చేస్తామని తెలియజేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెల 31 తో ముగియనున్నందున ప్రతి ఒక్కరు విధిగా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

# ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారు





- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- సివి రామన్ ట్యాలెంట్ స్కూల్‌లో అలరించిన వైద్య, విజ్ఞాన ప్రదర్శన

**వనపర్తిప్రతినిధి, మార్చి5 (నినాదం న్యూస్)** ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బండారునగర్‌లో ఉన్న డాక్టర్ సివి.రామన్ టాలెంట్ స్కూల్‌లో వైద్య, విజ్ఞాన ప్రదర్శన పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మురళీ ధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య, విజ్ఞాన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని వైద్య, విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. తెలంగాణ సంస్కృతులను, వృత్తి నైపుణ్యాలను, ఆధునిక కాలంలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న పలుఅంశాలను విద్యార్థులు కన్నులకు కట్టినట్లు రూపొందించారు. విద్యార్థుల సృజనాత్మకతను చూసి మాజీమంత్రి మురిసిపోయారు. శ్రద్ధగా ప్రదర్శన చూసి వివిధ విభాగాలలో విద్యార్థులు రూపొందించిన అంశాలును చూసి వారిని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని కొని యాడారు. ఇంత గొప్పగా వైద్య, విజ్ఞాన ప్రదర్శన నిర్వహించిన స్కూల్ యాజమాన్యాన్ని,అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

ఈకార్యక్రమంలో శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కంచరవి, శివ,లక్ష్మణ్, స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మురళీ ధర్, డాక్టర్ శారద, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ మౌనిక, సత్తార్, నవీన్ కుమార్, షబానా, జనజ్వాల రాధాకృష్ణ, గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి ఆశయాన్ని సాధించిన కుమార్తె

## ఎంబీబీఎస్ పట్టా అందుకున్న నందిత



**దమ్మపేట, మార్చి 5,(నినాదం న్యూస్):** మల్కారం గ్రామానికి చెందిన ఉత్తమ రైతు, మాజీ సర్పంచ్ కునుసోతు రూప్‌సింగ్ రెండవ కుమార్తె కునుసోతు నందిత చిన్ననాటి నుండి చదువు పై ఆసక్తి కలిగి ఎలాగైనా ఎంబిబిఎస్ పట్టా సాధించాలనే లక్ష్యంతో విద్యను అభ్యసించి వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంతో పట్టుదలతో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టాను సాధించి తండ్రి ఆశయానికి ఊపిరి పోసింది. ఈ సందర్భంగా ఎంబిబిఎస్ పట్టా సాధించిన నందితను పలువురు నాయకులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నేటి విద్యార్థిని విద్యార్థులు కునుసోతూ నందితను ఆదర్శంగా తీసుకుని ఉన్నతమైన చదువులను చదువుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

# పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలి

## కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు ప్రతినిధి, (నినాదం):** ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పారదర్శంగా పక్కగా పరీక్షలు జరిగేలా చూడాలని కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న తొలిరోజున పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నా రా... నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి,ఏఎన్ఎం,టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచిం చారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసుబందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలనిఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచ్ లు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అను మతించ కూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి చంద్రకళ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టులకు బీమా అందించడం అభినందనీయం

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- జర్నలిస్టుల అటాక్స్ కమిటీ పునరుద్ధరించాలి
- వినతిపత్రం అందజేసిన టీఎస్‌జెయు నేతలు

**భూపాలపల్లి, మార్చి 5 (నినాదం న్యూస్):** జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా అవసరం అని, టీ.ఎస్.జె.యూ జర్నలిస్టులకు ప్రమాద బీమా అందించడం అభినందనీయమని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జె.యు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగొని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్,ఎన్‌యుజె(ఐ)జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో టీఎస్ జెయు జిల్లా కమిటీ సభ్యులు కలసి జర్నలిస్టుల దాడులకు సంబంధించిన కమిటీని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జర్నలిస్టులకు టీ.ఎస్.జె.యు ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా ఇవ్వడం సంతోషకరమని అన్నారు. విధి నిర్వహణలో రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా వార్తా సేకరణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు.అలాంటి సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

టీఎస్ జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ కల్పించే సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో పని చేసే విధంగా చొరవ తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్,జిల్లా ఉపాధ్యక్షులు,గట్టు రవీందర్,సంయుక్త కార్యదర్శులు పల్నాటి రాజు,కడపాక రవి,కోశాధికారి గా సంగెమ్ శేఖర్,ఆర్గనైజ్ సెక్రెటరీ మారేపల్లి చంద్రమౌళి, బొల్లపెల్లి.జగన్,ఈసి సభ్యుడు కె.దేవేందర్ మీడియా ఇంచార్జి కార్యూరి సతీష్.. తదితరులు పాల్గొన్నారు.



NINADAM CINEMA

# కల్యాణ్‌రామ్ సినిమాలో కీలక పాత్రలో విజయశాంతి

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఇందులో విజయశాంతి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని సమాచారం. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత ఆమె మహేశ్ నటించిన సరిలేరు నీకెవ్వరూ' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. తదుపరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో కీలక పాత్ర చేయడానికి అంగీకరించారు. ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్ధన్, కల్యాణ్ రామ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్నారు.



# అకీరా సినిమాకు ఆ హీరోయిన్ అయితే బాగుంటుంది

## డిమాండ్ చేస్తున్న ఫ్యాన్స్

పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చాక సినిమాలపై ఫోకస్ తక్కువగా పెడుతున్నాడు. దీంతో పవన్ తనయుడు అకీరాని హీరోగా చూడాలని అభిమానులు అనుకుంటున్నారు. అకీరా నందన్ తొలిసినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందని కొన్నాళ్లుగా జోరుగా డిస్కషన్ జరుగుతుంది. అయితే పవన్ తన వారసుడు అకీరా నందన్‌ను అతి త్వరలో లాంచ్ చేసే పనిలో నిమగ్నమయ్యారని ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది.అకీరా నందన్‌ను ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ లాంచ్ చేయనున్నట్టు సమాచారం. సూపర్ స్టార్ మహేశ్ బాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్‌లను కూడా ఇండస్ట్రీకి పరిచయం చేసింది అశ్వినీ దత్ కాగా, ఇప్పుడు అకీరా నందన్ బాధ్యతలను కూడా ఆయనే తీసుకున్నారని తెలుస్తోంది.అయితే అకీరా నందన్ హీరోఅయితే ఆయన సరసన నటించే కథానాయిక ఎవరు అయితే బాగుంటుందనే చర్చ కూడా మొదలైంది.. అఖీరానందన్ ఎప్పుడు ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన సరే హీరోయిన్ మాత్రం మహేష్ బాబు కూతురు సీతార అయి ఉండాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇండ స్ట్రీలో మొదటి నుంచి పవన్, మహేష్‌బాబు మధ్య మంచి స్నేహ బంధం ఉంది. ఈక్రమంలో అకీరా సరసన సితారని హీరోయిన్‌గా పరిచయం చేయ డానికి మహేష్ ఎలాంటి అభ్యంతరం తెలపకపో వచ్చు. మరోవైపు సితార కూడా సినీ ఇండస్ట్రీలో తన సత్తా చూపించాలని ఎంతగానో అనుకుం టుంది. మరి అకీరా-సితార జంటగా ఎవరైన సినిమా తీస్తే మాత్రం అది బ్లాక్ బస్టర్ కావడం ఖాయం. ఇది జరుగుతుందా లేదా అనేది చూడా ల్సి ఉంది. కాగా,అకీరా నందన్ మొదటి సినిమాకు తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ దర్శకత్వం వహిం చనున్నాడని గత కొద్దిరోజులుగా సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. పవన్ కళ్యాణ్‌తో 'పంజా' సినిమాను తెరకెక్కించిన విష్ణువర్ధన్, ఇప్పుడు అకీరా నందన్‌ను లాంచ్ చేయడంకి సంబంధించి కూడా పూర్తి క్లారిటీ రావలసి ఉంది.




# నాగార్జున్‌తో ఊరమాస్ సాంగ్ చేసిన పూజా హెగ్డె

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో కూడా పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం.



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమ యంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య.. రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నెగటివ్ షేడ్ ఉన్న రోల్ అని సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే నాగ్ తనయులు నాగచైతన్యతో ఒక లైలా కోసం, అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఇప్పుడు నాగార్జునతో చిందులేయడం హాట్ టాపిక్‌గా మారింది.



# పార్లమెంట్‌కు రామ్‌చరణ్ ఎందుకో తెలుసా..?

ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత 'గేమ్ ఛేంజర్' అంటూ వచ్చాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అవుతుందనుకుంటే బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలానే కసితో ప్రస్తుతం ఒక సినిమా చేస్తున్నాడు. ఆయన కథానాయకుడిగా రాబోతున్న తాజా ప్రాజెక్ట్ 16. పాన్‌ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఈ సిని మాకి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా.. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఉత్తరాంధ్రా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపు కుంటుంది. అయితే ఈ సినిమా కోసం రామ్ చర ణ్ పార్లమెంట్‌కి వెళ్లబోతున్నాడు. కథలో భాగంగా.. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు మేకర్స్. ఇంద ులో భాగంగానే రామ్‌చరణ్ పార్లమెంట్‌లో జరిగే షూటింగ్‌లో పాల్గొననున్నాడు. ఈషూటింగ్ కోసం చిత్రబృందం ఇప్పటికే అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొగా.. అధికారుల నుంచి అనుమతుల కోసం ఎదురుచూస్తుంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ చక్రవర్తి శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# అందంతో కట్టిపడేస్తున్న రెబామోనికా

రెబా మోనికా జాన్ ఒక భారతీయ నటి, మోడల్, ఆమె తమిళ, మలయాళ చిత్రాలలో ప్రముఖంగా పని చేస్తుంది మరియు కొన్ని తెలుగు మరియు కన్నడ చిత్రాలలో పని చేసింది. తాజా సోషల్ మీడియా ఈ కోమలి షేర్ చేసిన తెగ వైరల్ అవుతున్నాయి. మీరు కూడా వీటిపై ఓ లుక్ వెయ్యండి. 4 ఫిబ్రవరి 1994న కర్ణాటక రాజధాని బెంగుళూరులో ఓ మలయాళీ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ రెబ మోనికా జాన్. ఈ ముద్దుగుమ్మ తండ్రి పేరు జాన్, ఈమె తల్లి పేరు మినీ జాన్. ఈ బ్యూటీ కుటుంబం క్రైస్తవ మతానికి చెందినవారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో సేక్రెడ్ హార్ట్ గర్ల్స్ హై స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ భామ. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందింది ఈ అందాల తార రెబ. 2022లో క్రైస్తవ సంప్రదాయంలో కుటుంబీకులు, బంధుమి త్రుల మధ్య జోమోన్ జోసెఫ్ అనే వ్యక్తిని వివాహం చేసు కుంది. ఈ వయ్యారి సినిమాలకు ముందు కొన్ని ప్రకటనలలో కనిపించింది. అందులో ధాత్రి హెయిర్ ఆయిల్ ప్రకటన చాల ప్రముఖమైనది. 2016లో జాకోబింటే స్వర్గరాజ్యం అనే మలయాళీ ఫ్యామిలీ డ్రామాతో సినీరంగ ప్రవేశం చేసింది. తర్వాత మలయాళీ, తమిళ చిత్రాల్లో కనిపించింది. 2023లో శ్రీవిష్ణుకి జోడిగా కామెడీ డ్రామా చిత్రం సామజవరగమన చిత్రంతో తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది రెబ జాన్. ఈ నెల 29న విడుదల కానున్న తెలుగు కామెడీ ఎంటర్టైనర్ మ్యాడ్ స్క్వేర్ సినిమా ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించనున్న ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికి విడుదలైన ఈ పాట లిరికల్ వీడియోకి ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది.





# కమల్, అజిత్‌ను ఫాలో అవుతున్న నయన్

ఒకప్పుడు నటీనటులకు తమకు పెద్దవారు ఇచ్చే బిరుదులను ఆదరంగా స్వీకరించి, గొప్పగా చెప్పుకునే వారు. ఆ తర్వాత అభిమానులు ప్రేమతో ఇచ్చే బిరుదులనూ స్వీకరించడం మొదలు పెట్టారు. కొందరైతే దర్శక నిర్మాతలకు సూచన చేసి మరీ బిరుదులను పొందిన వారూ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం సినిమా రంగంలో సేవ చేసిన వారికి గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాలను ప్రకటిస్తూ ఉంటుంది. అయితే అది బిరుదు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. సినిమా టైటిల్స్ కార్డుల్లో పేరు ముందు పద్మశ్రీ అనే పదాన్ని బిరుదులా ఉపయోగించడం నిషిద్ధం. కావాలనుకుంటే సదరు వ్యక్తి 'పద్మశ్రీ పురస్కార గ్రహీత' అని పేరు ముందు వేసుకోవచ్చు. అయితే... ప్రభుత్వం ఇచ్చే పద్మ పురస్కారాల కంటే... స్టార్ హీరోలకు, హీరోయిన్లకు, దర్శకులకు అభిమానులు, సినిమా ఇండస్ట్రీ వాళ్ళు ఇచ్చే బిరుదులంటే భలే ఇష్టం. ఎలాంటి సంకోచం లేకుండా ఆ బిరుదులను సినిమా టైటిల్స్ కార్డుల్లోనూ, మీడియాకు ఇచ్చే ప్రెస్ నోట్స్ లోనూ వాడేసుకుంటారు. ఇటీవల ఇలాంటి బిరుదల పట్ల, అభిమానులు తమ పేర్ల ముందు చేర్చుతున్న విశేషణాల పట్ల కొందరు నటీనటులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తమను పేరుతో సంభోదిస్తే చాలని, ప్రత్యేకమైన బిరుదలను పెట్టవద్దని బహిరంగంగా అభిమానులను వేడుకుంటున్నారు. ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత కమల్ హాసన్‌ను కొంతకాలంగా ఉళగనాయకన్ అనే పేరుతో సంభోదిస్తున్నారు. అయితే... తనకు అలాంటి బిరుదులు తగిలించుకోవడం ఇష్టం లేదని కమల్ హాసన్ ఇటీవల స్పష్టం చేశారు. అలానే తమిళ స్టార్ హీరో అజిత్‌ను ఫ్యాన్స్ ప్రేమతో 'తల' అని పిలుస్తుంటారు. అజిత్ కూడా ఇటీవల అభిమానులకు ఓ ఓపెన్ లెటర్ రాసి... అతను అజిత్ అని పిలిస్తే చాలని అన్నారు. ఇప్పుడు అదే బాటలో లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా నడుస్తోంది. గత కొంతకాలంగా సౌతిండియన్ సూపర్ స్టార్ అనే పేరును నయన్ కు విశేషణంగా తగిలించారు. ఆమె ఇటీవల ఉత్తరాదిలోకీ అడుగుపెట్టి, అక్కడా 'జవాన్' సినిమాతో తన సత్తాను చాటింది. దాంతో ఉత్తరాది వారు సైతం నయన్ ను 'లేడీ సూపర్ స్టార్' అనడం మొదలైంది. అయితే... తన పేరు ముందు ఇలాంటివేవీ ఇక మీద పెట్టవద్దని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది.

నయన్ అనే పేరే తన మనసుకు ఎంతో దగ్గరగా ఉంటుందని, అందువల్ల అదే పేరుతో తనను సంభోదించమని ఆమె కోరింది. 'రేపు ఎలా ఉంటుందో మనకు తెలి యదు. కానీ అభిమానుల ప్రేమ నాకు ఎప్పుడూ ఉంటుందని భావిస్తున్నాను. వారికి వినోదం పంచడానికి నేను ఎల్లప్పుడూ కష్టపడుతూనే ఉంటాను. సినిమా అనేది మనందరినీ కలిపింది. దానిని అందరం కలిసి ఆస్వాదిద్దాం' అని నయన్ ఆ లేఖలో పేర్కొంది. ఇక సినిమాల విషయానికి వస్తే నయనతార 'ముక్కుత్తి అమ్మన్ -2, రక్కాయి, మన్ననట్టి సిన్స్ 1960, టెస్ట్' తదితర ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741